మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం
MONDAY
12-1-2026

జగిత్యాల JAGITIAL || పేజీలు: 8 PAGES:8 || వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 || సంచిక: 194 Issue: 194

12 జనవరి 2026 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - హేమంత ఋతువు పుష్య మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:52 సూర్యాస్తమయం - సా. 5:55 తిథి నవమి మ. 12:43 వరకు తరువాత దశమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం స్వాతి రా. 9:00 వరకు తరువాత విశాఖ యోగం ధృతి సా. 6:09 వరకు కరణం గరజి మ. 12:43 వరకు వనిజ రా. 2:00 వరకు వర్జ్యం తె. 3:23 నుండి తె. 5:11 వరకు దుర్ముహూర్తం మ. 12:46 నుండి మ. 1:30 వరకు మ. 2:58 నుండి మ. 3:43 వరకు రాహుకాలం ఉ. 8:15 నుండి ఉ. 9:38 వరకు యమగండం ఉ. 11:01 నుండి మ. 12:24 వరకు గుళికాకాలం మ. 1:47 నుండి మ. 3:10 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:16 నుండి ఉ. 6:04 వరకు అమృత ఘడియలు ఉ. 11:13 నుండి మ. 1:00 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:02 నుండి మ. 12:46 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com




# 547 కోట్ల దొంగలు

## విదేశాల్లో కాల్ సెంటర్లతో సైబర్ మోసాలు

### నిరుద్యోగుల పేరుపై బ్యాంకు ఖాతాలు... ప్రధాన నిందితుల్లో సత్తుపల్లి, కల్లూరు, వేంసూర్ వాసులు

ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో భారీ సైబర్ క్రైమ్ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. 547 కోట్ల రూపాయలు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేశారు. అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్తులతో కలిసి మోసం చేస్తున్నట్లుగా గుర్తించారు. విదేశాల్లో కాల్ సెంటర్లు నిర్వహిస్తూ అమాయకులను బురిడీ కొట్టిస్తున్నట్లుగా సత్తుపల్లి పోలీసులు తేల్చారు. ప్రజల నుంచి బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకుని అనధికారిక లావాదేవీలు జరిపారు.

సత్తుపల్లి, జనవరి 11 (ఈవార్తలు): ప్రధాన నిందితుడు ప్రవీణ్ తో పాటు సహకరించిన 18మందిని అరెస్ట్ చేశారు పోలీసులు. ఈ సైబర్ క్రైమ్ ముఠా అరెస్ట్ కు సంబంధించి వీ.ఎం.బంజర్ పోలీస్ స్టేషన్‌లో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మీడియాతో మాట్లాడారు. సైబర్ క్రైమ్ నేరాలకు పాల్పడి కోట్ల రూపాయలు కాజేసిన కేసులో పలు కీలక విషయాలను ఆయన వెల్లడించారు. "నిందితులు నిరుద్యోగులను టార్గెట్ చేసుకున్నారు. ఉద్యోగాల పేరుతో వారిని నమ్మించారు. వారి పేరు -2 వ పేజీలో...

# బుద్ధిగా పనిచేస్కో!

## ఇంకా మూడేళ్ల అధికారం ఉంది

### ఎన్నికల హామీలపై దృష్టి పెట్టు.. సీఎం రేవంత్‌కు కేటీఆర్ హితవు



'బీఆర్ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు ఏం సాధించారని కేటీఆర్ ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి తెల్వదు.. చెబితే వినడు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకో. ఇంకా మూడేళ్ల అధికారం ఉంది.. ఇప్పటికైనా మంచి పనులు చేయాల'ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలపై దృష్టిపెట్టాలని సూచించారు. నిరుద్యోగులు రోడ్లపైకి వస్తున్నారని తెలిపారు.

హైదరాబాద్, జనవరి 11 (ఈవార్తలు): అశోక్ నగర్ వెళ్లడానికి కూడా సీఎం రేవంత్ రెడ్డి భయపడుతున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డి 70వేల ఉద్యోగాలు కాదు.. 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాగితాలు ఇచ్చి ఫోజులు కొడుతున్నాడని విమర్శించారు. 2014కు ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా మారిందో గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. ఆదివారం బండ్లగూడ మాజీ మేయర్ శ్రీలత ప్రేమ్ గౌడ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు తెలంగాణపై ఇష్టంతో పనిచేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. 2014కు ముందు కరెంటు పరిస్థితి ఎలా ఉండేది.. కేసీఆర్ వచ్చాక ఎలా మారిందో గుర్తుతెచ్చుకోవాలని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి తరువాయి 2 వ పేజీలో...



# 108 గుర్రాలతో కాన్వాయ్

### ప్రధాని మోదీకి రక్షణగా అశ్వాలు

### సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌కు హాజరు

### స్వయంగా ఢమరుకం వాయించిన ప్రధాని

సోమనాథ్: గుజరాత్‌లోని పవిత్ర సోమనాథ్ క్షేత్రంలో ఆదివారం శౌర్య యాత్ర నిర్వహించారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ పేరుతో నిర్వహించిన ఈ యాత్రలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తరువాయి 2 వ పేజీలో...

# హీరో సినిమాపై సర్కారు కక్ష



### సినిమా టికెట్ల రేట్లపై కనిపించని శక్తి

### సినిమా వాళ్లను రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు

### ప్రభుత్వంపై మాజీమంత్రి హరీశ్ ఫైర్

సినిమా టికెట్ల రేట్లపై కమీషన్ల దందా నడుస్తోందని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఎన్నికల్లో ఓడిపోయి రాజ్యాంగేతర శక్తిగా ఎదిగిన ఓ వ్యక్తి సినిమా టికెట్ల రేట్లను శాసిస్తున్నారని, కమీషన్ల రూపంలో కోట్ల రూపాయలు వసూలు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. ఆ వివరాలను త్వరలో బయటపెడతామన్నారు. ఈ కమీషన్ల దందాపై గవర్నర్ దృష్టి సారించాలని కోరారు. దీనిపై సమగ్ర విచారణ విచారణ జరపాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

సిద్దిపేట/హైదరాబాద్, జనవరి 11 (ఈవార్తలు): సినిమా టికెట్ల ధరల పెంపు అంశంపై రేవంత్ సర్కార్ పై నిప్పులు చెరిగారు హరీశ్ రావు. 'ఓవైపు టికెట్ ధరలు పెంచుతూ జీవో ఇస్తారు. మరోవైపు సినిమాటోగ్రఫీ మంత్రేమో తనకు తెలియదంటారు. ఇదేం పాలన' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ పై నిప్పులు చెరిగారాయన. గత పదేళ్లు కేసీఆర్ సీఎం ఉన్నప్పుడు సినీ పరిశ్రమను కంటికి రెప్పలా కాపాడుకున్నామని, ఎక్కడా వివక్ష చూపలేదని హరీశ్ తెలిపారు. అందుకే ఇవాళ తెలుగు సినిమా ఆస్కార్ స్థాయికి ఎదిగిందని, ప్రపంచం గర్వించేలా మన సినిమాలు తయారవుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం అంటే అందరినీ సమానంగా చూడాలని సీఎం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



ప్రపంచంలో జీవించి ఉన్న అతి వృద్ధ జంతువుగా జొనాథన్ (తాబేలు) పేరిట రికార్డు ఉంది. ఈ తాబేలు వయసు ప్రస్తుతం 192 ఏళ్లు. 1832లో పుట్టిన జొనాథన్.. 50 ఏళ్ల వయసులో షీషెల్స్‌కు తీసుకొచ్చారు. అప్పటి నుంచి అక్కడే అది జీవనం కొనసాగిస్తోంది.



# మురిసిన మేడారం

### తరలివచ్చిన భక్తజనం.. అమ్మలకు బంగారు బోనం

తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. జాతరకు ఇంకా కొద్ది రోజులు గడువు ఉన్నప్పటికీ, అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు ముందస్తుగానే మేడారానికి భారీగా తరలివస్తున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో భక్తజనం రద్దీ రోజు రోజుకీ పెరుగుతోంది.

మేడారం, జనవరి 11 (ప్రవీణ్ కుమార్ - ఈవార్తలు ఫీల్డ్ రిపోర్టర్): మేడారానికి చేరుకున్న భక్తులు ముందుగా పవిత్రమైన జంపన్న వాగులో స్నానాలు ఆచరించి, అనంతరం సమ్మక్క--సారలమ్మ, పడిగిద్దరాజు, గోవిందరాజులను దర్శించుకుంటున్నారు. అమ్మవార్లకు ఎత్తు బంగారం, చీరలు, సారెలు, గాజులు, ఒడు బియ్యం సమర్పిస్తూ తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర వాతావరణం మొత్తం భక్తి భావంతో నిండిపోయింది. ఆదివారం సెలవు దినం కావడంతో తరువాయి 2 వ పేజీలో...



# టెలికం కంపెనీలకు 150 కోట్ల జరిమానా

దేశీయ టెలికం కంపెనీలపై నియంత్రణ సంస్థ ట్రాయ్ భారీ జరిమానా విధించింది. స్పామ్ కాల్స్, మెసేజ్‌లను అరికట్టడంలో విఫలమైనందుకు టెలికాం ఆపరేటర్లపై రూ.150 కోట్ల జరిమానా విధించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

న్యూఢిల్లీ: ఈ జరిమానా 2020 నుంచి మూడు సంవత్సరాల కాలంలో జరిగిన వైఫల్యాలకు అనుగుణంగా విధించింది. కస్టమర్ ఫిర్యాదులను పరిష్కరించ కుండానే నిలిపేయడం, నిబంధనల ప్రకారం స్పామర్ల టెలికాం కనెక్షన్లపై చర్యలు తరువాయి 2 వ పేజీలో...



## టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్.. పవన్ కల్యాణ్

అవార్డు ప్రదానం చేసిన గోల్డెన్ డ్రాగన్స్ సంస్థ.. జపనీస్ కత్తిసాము కెంజుట్సులో ప్రవేశం

## రాశి ఫలాలు
12.1.2026

మేషం: వ్యాపారస్థులకు నూతన అవకాశాలు లభిస్తాయి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆప్తుల నుండి ఆశించిన సహాయం అందుతుంది. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు.

వృషభం: నూతన కార్యక్రమాలను ప్రారంబించి సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయ సందర్శనాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక సమాచారం అందుతుంది. నూతన వ్యాపార ప్రారంభానికి పెట్టుబడులు అందుతాయి. దీర్ఘకాలిక ఋణ సమస్యలు పరిష్కరించుకుంటారు.

మిధునం: ఉద్యోగస్థులకు స్థానచలనాలు తప్పవు. ఆకస్మికంగా ప్రయాణాలు చెయ్యవలసి వస్తుంది. వృథ ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనుల్లో స్వల్ప అవాంతరాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. కుటుంబమున అదనపు బాధ్యతలు కొంత చికాకు పరుస్తాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులలో ఆటంకాలుంటాయి. కుటుంబ పెద్దల ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారమున ఊహించని సమస్యలు ఎదురవుతాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరుగుతుంది. కొన్ని వ్యవహారాలలో అధిక కష్టంతో అల్ప ఫలితం పొందుతారు. దూర ప్రయాణాలలో మార్గవరోధాలు కలుగుతాయి.

సింహం: మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న విధంగా పనులు పూర్తి చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగమున సమస్యలు తొలగి ఊరట చెందుతారు. సంఘంలో ప్రముఖులతో పరిచయాలు విస్తృతమౌతాయి. శుభ కార్యములకు ధనవ్యయం చేస్తారు.

కన్య: ఉద్యోగులకు ఇతరుల నుండి ఊహించని సమస్యలు కలుగుతాయి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. బంధు వర్గంతో మాటపట్టింపులు ఉంటాయి. కుటుంబ వాతావరణం చికాకు పరుస్తుంది. ధనదాయ మార్గాలకు అవరోధాలు కలుగుతాయి. ఇంటా బయట విమర్శలు అధికమౌతాయి.

తుల: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారమున నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు కొంత అనుకూలిస్తాయి. సమాజంలో ఉద్యోగమున సమస్యలు అధిగమించి ముందుకు సాగుతారు. గౌరవ మర్యాదలకు లోటుండదు మిత్రుల నుండి విలువైన వస్తువులు బహుమతులుగా పొందుతారు.

వృశ్చికం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. వృత్తి ఉద్యోగాలలో నూతన బాధ్యతలు చేపడతారు. అవసరానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. నూతన ఋణ ప్రయత్నాలు కలసిరావు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. గృహమున కొందరి ప్రవర్తన వలన శిరోభాధలు తప్పవు.

ధనస్సు: ఆర్ధికంగా అనుకూలత కలుగుతుంది. కుటుంబ సభ్యులతో దైవదర్శనం చేసుకుంటారు. గృహమున చిన్ననాటి మిత్రులతో సంతోషంగా గడుపుతారు. వృత్తి వ్యాపారములలో నూతన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఉద్యోగమున అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

మకరం: ఆప్తులు నుంచి ధన సహాయం అందుతుంది. ఆదాయ మార్గాలు విస్తృతమౌతాయి. చేపట్టిన పనులలో కార్యజయం కలుగుతుంది. వ్యాపారమున ఆశించిన లాభాలు అందుతాయి. ఉద్యోగస్థుల కలలు ఫలిస్తాయి. ఆధ్యాత్మిక విషయాలపై దృష్టి సారిస్తారు. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు.

కుంభం: సన్నిహితుల నుండి ఊహించని సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాటపట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగులు అధికారుల ఆగ్రహానికి గురికావలసి వస్తుంది. సోదరులతో ఆస్తి వివాదాలు చికాకు కలిగిస్తాయి. ఇతరుల నుండి ఋణ ఒత్తిడులు అధికమౌతాయి.

మీనం: ఉద్యోగాలలో అదనపు బాధ్యతలు వలన తగిన విశ్రాంతి ఉండదు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. దాయదుల తో స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది.




# 547 కోట్ల దొంగలు

మొదటి పేజీ తరువాయి

మీద బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేసి సైబర్ క్రైమ్‌లకు పాల్పడ్డారు. సైబర్ క్రైమ్ ద్వారా 547 కోట్ల రూపాయలను అక్రమంగా సంపాదించారు నిందితులు. సైబర్ క్రైమ్ ముఠాలో సత్తుపల్లి, కల్లూరు, వేంసూర్ మండలానికి చెందిన ఆరుగురు ప్రధాన నిందితులు ఉన్నారు. పోట్రు మనోజ్ కళ్యాణ్, ఉడతనేని వికాస్ చౌదరి, పోట్రు ప్రవీణ్, మేడా భానుప్రియ, మేడా సతీష్, మోరంపూడి చెన్నకేశవను అరెస్ట్ చేశాం. గత ఏడాది డిసెంబర్ లో వీఎం బంజర్ పోలీస్ స్టేషన్ లో సాయికిరణ్ అనే వ్యక్తి ఫిర్యాదుతో కోట్ల రూపాయల సైబర్ క్రైమ్ కేసు వెలుగు చూసింది. నిందితులకు తమ బ్యాంక్ అకౌంట్లను ఇచ్చి సహకరించిన మరో 17 మందిపై కేసులు నమోదు చేశాము. నిందితులు అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నేరస్తులతో కలిసి కాల్ సెంటర్లు నిర్వహిస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మ్యాట్రిమోనీ, రివార్డ్ పాయింట్లు, గేమింగ్, బెట్టింగ్, షేర్ మార్కెట్ లో పెట్టుబడులు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్ పేరుతో మోసాలు చేస్తున్నారు. నేరస్తుల బ్యాంకు ఖాతాలపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో వందల సంఖ్యలో సైబర్ క్రైమ్ ఫిర్యాదులు నమోదయ్యాయి" అని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. 2025 డిసెంబర్ 24న సాయికిరణ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ భారీ సైబర్ మోసం బయటపడింది. ఆ ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపిన పోలీసులకు సంచలన విషయాలు తెలిశాయి. ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసి కొంతమంది దగ్గర బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల ద్వారా భారీ స్థాయిలో సైబర్ క్రైమ్ కు పాల్పడ్డారు. కల్యాణ్ ఖాతాలో 114 కోట్ల రూపాయల లావాదేవీలు జరిగాయి. కల్యాణ్ భార్య భానుప్రియ బ్యాంకు అకౌంట్ లో 40 కోట్లు జమ అయ్యాయి. కల్యాణ్ బావమరిది సతీశ్ బ్యాంకు అకౌంట్‌లో 130 కోట్లు జమ అయినట్లు పోలీసులు గుర్తించారు. నాగలక్ష్మి బ్యాంకు అకౌంట్‌లో 80 కోట్లు జమ అయ్యాయి. మొత్తం 547 కోట్ల రూపాయల సైబర్ ఫ్రాడ్ చోటు చేసుకుంది. కంబోడియాలో ఉన్న ఏజెంట్లకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లుగా గుర్తించారు. ఒకో వ్యక్తి నుంచి 10 వరకు బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్నారు. కంబోడియాలో ఉన్న కాల్ సెంటర్ ద్వారా సైబర్ నేరాలకు పాల్పడ్డారు. ఈ మోసం నేపథ్యంలో పోలీసులు పౌరులను హెచ్చరించారు. ఇతరులకు తమ బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వడం నేరం అని చెప్పారు. సైబర్ క్రైమ్ లో ఇంకా ఎవరెవరు పాల్గొన్నారు అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. ఈ కేసుని పోలీసులు చాలా సీరియస్ గా తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా పోలీసులు విచారణ జరుపుతున్నారు.




# 108 గుర్రాలతో కాన్వాయ్

మొదటి పేజీ తరువాయి

పాల్గొన్నారు. సోమనాథ్ ఆలయంపై జరిగిన దాడులను ఎదుర్కొని.. ప్రాణాలర్పించిన వీరులను స్మరించుకోవడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాత్రలో 108 శిక్షణ పొందిన గుర్రాలు.. ప్రధాని మోదీ కాన్వాయ్‌కు రక్షణగా సాగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివ భక్తుల దమరుక నాదాల మధ్య ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా తన రెండు చేతులతో దమరుకాన్ని వాయిస్తూ అక్కడికి వచ్చిన భక్తజనసందోహాన్ని ఉత్సాహపరిచారు. సోమనాథ్ రక్షణలో ప్రాణత్యాగం చేసిన వీర హమీర్జీ గోహిల్ విగ్రహానికి ప్రధాని మోదీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. క్రీస్తుశకం 1026లో మహమ్మద్ గజనీ సోమనాథ్ ఆలయంపై జరిపిన మొదటి దాడికి 1000 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ నిర్వహిస్తున్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ చొరవతో పునర్నిర్మించిన ఈ సోమనాథ్ ఆలయం తిరిగి 1951లో ప్రారంభమైంది. ఆ పునఃప్రతిష్ఠాపన జరిగి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భాన్ని కూడా ఈ వేడుక ప్రతిబింబిస్తోంది. ప్రధాని మోదీ మొత్తం 3 రోజుల పర్యటనలో భాగంగా గుజరాత్ చేరుకోగా.. ఈ ఉదయం శౌర్యయాత్రలో పాల్గొన్నారు. సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్‌లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ కట్టిపడేశాయి. ఈ యాత్రలో భారీగా పాల్గొన్న ప్రజలు.. మోదీ, మోదీ నినాదాలతో హోరెత్తించారు. ప్రధాని మోదీ ఆలయం వద్దకు వెళ్తుండగా.. ఆ 108 గుర్రాలు ఎస్కార్ట్‌గా వెళ్లడం అందర్నీ మంత్రముగ్ధుల్ని చేసింది. ఆ తర్వాత సోమ్‌నాథ్ ఆలయానికి చేరుకున్న ప్రధాని మోదీ.. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### దేదీప్యమానంగా భారత ప్రగతి: మోదీ

భారత ఆర్థిక ప్రగతి ప్రస్తుతం శరవేగంగా సాగుతోందని, ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని పదిలపరుచుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఆదివారం రాజ్‌కోట్ లో జరిగిన 'వైబ్రంట్ గుజరాత్ రీజినల్ కాన్ఫరెన్స్ (కచ్, సౌరాష్ట్ర)లో ఆయన కీలక ఉపన్యాసం చేశారు. దేశంలో ద్రవ్యోల్బణం అదుపులో ఉండటంతో పాటు, వ్యవసాయ ఉత్పత్తి, పాల ఉత్పత్తిలో రికార్డు స్థాయి వృద్ధి నమోదైందని తెలిపారు. స్టార్టప్ ఎకోసిస్టమ్, విమానయాన మార్కెట్, మెట్రో రైల్ నెట్‌వర్క్‌లలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో నిలిచిందని గుర్తుచేశారు. అలాగే అత్యధిక మొబైల్ డేటా వినియోగించే దేశంగా, రెండో అతిపెద్ద మొబైల్ తయారీదారుగా భారత్ రికార్డు సృష్టించిందన్నారు. భారత్ త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోందని, ఈ ప్రయాణంలో గుజరాత్ దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు గ్రోత్ ఇంజిన్‌లా మారిందని ప్రధాని కొనియాడారు. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాలు కేవలం అవకాశాలకే పరిమితం కాకుండా, దేశ ప్రగతికి బలమైన పునాదిగా మారాయని అభివర్ణించారు.



# హీరో సినిమాపై సర్కారు కక్ష

మొదటి పేజీ తరువాయి

రేవంత్‌కి హితవు పలికారు. ఒకరికి చుట్టం, మరొకరికి శత్రుత్వం ఉండకూడదన్నారు. సినిమా వాళ్లను కూడా మీ రాజకీయాలకు వాడుకోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఇది ప్రజా పాలన కాదు.. ఇది మీ పాపిష్టి పాలన కు పరాకాష్ట అంటూ సీఎం రేవంత్ పై ధ్వజమెత్తారు. అసలు సినిమా రంగాన్ని ఒక పరిశ్రమగా చూస్తున్నారా? లేక మీ రాజకీయ కక్షలు తీర్చుకునే అడ్డాగా మార్చుకున్నారా? అని ముఖ్యమంత్రి రేవంత్ ని ప్రశ్నించారు. ఒక సినిమాకేమో అర్ధరాత్రి దాకా పర్మిషన్ ఇవ్వరు.. ఇంకో సినిమాకేమో రెండు రోజుల ముందే రాచమర్యాదలతో పర్మిషన్ ఇస్తారని విమర్శించారు. సినిమాటోగ్రఫీ మంత్రి పరిస్థితి చూస్తే జాలేస్తోందన్నారు హరీశ్ రావు. ఒక పక్క హోం శాఖ జీవో ఇస్తుంది.. సినిమా మంత్రి ఏమో నాకు సంబంధం లేదు, నా దగ్గరికి ఎవరూ రాలేదు అంటారు.. ఇదెక్కడి విడ్డూరం అని వ్యాఖ్యానించారు. వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అన్నందుకు ఒక హీరో సినిమాపై కక్ష కడతారు. మీ పేరు మర్చిపోయినందుకు ఇంకో హీరోని జైలుకు పంపిస్తారు. ఇప్పుడు మీకు నచ్చినోళ్లు అయితే.. రూ. 600 టికెట్ రేటుకి పర్మిషన్ ఇస్తారా? వారానికి వారం రోజులు రేట్లు పెంచుకోవచ్చని రెడ్ కార్పెట్ వేస్తారా? అని నిలదీశారు. తెలంగాణలో ఇప్పుడు థియేటర్ల కంటే.. సచివాలయంలోనే ఒక పెద్ద సస్పెన్స్ థ్రిల్లర్ సినిమా నడుస్తోందన్నారు హరీశ్ రావు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా.. ఉంటే ఎవరి కంట్రోల్‌లో ఉంది అనే అనుమానం ప్రతి ఒక్కరికీ కలుగుతోందన్నారు. ఒకవైపు సినిమా టికెట్ ధరలు పెంచుతూ జీవో బయటికి వస్తుంది. మరోవైపు.. ఆ శాఖకు బాధ్యత వహించాల్సిన సినిమాటోగ్రఫీ మంత్రి ఏమో.. నాకు తెలీదు.. నా ప్రమేయం లేదు.. నా దగ్గరికి ఫైల్ రాలేదు అని నిస్సహాయంగా చేతులెత్తేస్తారు అని హరీశ్ రావు విమర్శించారు.

# మురిసిన మేడారం

మొదటి పేజీ తరువాయి

మేడారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సమ్మక్క గద్దె వద్ద భక్తజన సంద్రోహం కనిపించింది. ఎక్కడ చూసినా భక్తుల గుంపులు, వాహనాల రద్దీతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి. పస్రా--మేడారం మార్గంలో వాహనాల రాకపోకలు పెరగడంతో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణ చేపట్టి వాహనాలను క్రమబద్ధంగా పంపిస్తున్నారు. జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరిగే మహాజాతర సమయంలో అపారమైన రద్దీని దృష్టిలో పెట్టుకొని, చాలామంది భక్తులు ముందుగానే వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. గద్దెల ప్రాంగణంలో భక్తుల సందడి పెరిగిన కొద్దీ ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మికత మరింత ఉట్టిపడుతోంది. ఇదిలా ఉండగా, మేడారంలో చేపట్టిన శాశ్వత నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. వందల ఏళ్ల పాటు నిలిచేలా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. గద్దెల ప్రాంగణ విస్తీర్ణం పెంపు, చుట్టూ తోరణాలు, మెరుగైన రహదారులు వంటి పనులు మేడారానికి కొత్త రూపు తీసుకొస్తున్నాయి. సమ్మక్క--సారలమ్మలను కొంగుబంగారంగా భావిస్తామని, ఈ తల్లులను దర్శించుకుంటే కోరిన కోరికలు తప్పకుండా నెరవేరుతాయని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి జాతరకు కుటుంబ సమేతంగా వచ్చి అమ్మవార్ల దర్శనం చేసుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని ఇస్తుందని చెబుతున్నారు. గత జాతరతో పోలిస్తే ఈసారి మేడారం మరింత అభివృద్ధి చెందినట్టు కనిపిస్తోందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# టెలికం కంపెనీలకు 150 కోట్ల జరిమానా

మొదటి పేజీ తరువాయి

తీసుకోకపోవడం వంటి ఉల్లంఘనలకు కంపెనీలు పాల్పడ్డాయి. వినియోగదారులు స్పామ్ నంబర్ల గురించి ఫిర్యాదు చేసినప్పుడు కూడా, కంపెనీలు ఆ స్పామర్లపై చర్యలు తీసుకోలేదు, అంటే వారి ఫోన్ కనెక్షన్లను బ్లాక్ చేయడం లేదా డిస్‌కనెక్ట్ చేయడం వంటివి చేయలేదు. ముఖ్యంగా టెలికం ఆపరేటర్లు సాధారణ 10-అంకెల మొబైల్ నంబర్‌లను ఉపయోగించే స్పామర్‌లపై సరైన చర్యలు తీసుకోవట్లేదని ట్రాయ్ గుర్తించింది. కాగా, గత సంవత్సరంలో ట్రాయ్ మొత్తం 21 లక్షలకు పైగా స్పామర్‌లను డిస్‌కనెక్ట్ చేసింది. లక్షకు పైగా సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో ఉంచింది.

# బుద్ధిగా పనిచేస్కో!

మొదటి పేజీ తరువాయి

వచ్చిన ఆరు నెలల్లోనే కరెంట్ సమస్యలు పరిష్కరించి.. అందరికీ నాణ్యమైన విద్యుత్ అందజేశారని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో వైకుంఠ ధామాలు, పార్కులు కట్టుకున్నామని పేర్కొన్నారు. మన రాష్ట్రం, మన ప్రజల కోసం పనిచేశామనిచెప్పారు. కరోనా సమయంలో కూడా 40 లింక్ రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని కేసీఆర్ వినియోగించుకున్నారని అన్నారు. ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు. కేసీఆర్ ప్రజలకు మంచి చేశారు కాబట్టే ఆయన్ను ప్రజలు మరిచిపోలేకపోతున్నారని తెలిపారు. కేసీఆర్ చేసిన అభివృద్ధితో భూముల ధరలు పెరిగాయని అన్నారు. అప్పట్లో రూ.5లక్షలు ఉన్న భూమి.. 30 నుంచి 50 లక్షలకు పెరిగిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ స్తంభించిందని పేర్కొన్నారు. రెండేళ్లలో రియల్ ఎస్టేట్‌ను తొక్కిపెట్టాడని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో భూముల రేట్లు తగ్గాయని అన్నారు. కళ్ల ముందటే ప్రజల ఆస్తి కరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రజలు మోసగాళ్లనే నమ్ముతారని రేవంత్ ఆరోజే చెప్పాడని అన్నారు. ప్రజలకు అలివికాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికల ముందు అరచేతిలో వైకుంఠం చూపించారని అన్నారు. అడ్డగోలు హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాడని అన్నారు. దేవుళ్లు, సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఒట్టు వేసి ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పాడని తెలిపారు. కేసీఆర్ 70 లక్షల మంది రైతులకు రూ.73 వేల కోట్లు రైతుబంధు ఇచ్చాడని తెలిపారు. కేసీఆర్ రైతుబంధుతో అగ్రవర్ణాలకు కూడా మేలు జరిగిందని అన్నారు. రైతు సంపద పెరిగితేనే అన్ని వర్గాలు ఆనందంగా ఉంటాయని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.200 ఉన్న పింఛన్‌ను రూ.2000 చేశారని తెలిపారు. పెన్షన్ ఏమైందని అడిగితే రేవంత్ రెడ్డి బూతులు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి వచ్చింది ఒకటే భాష.. అది బూతుల భాష అని ఎద్దేవా చేశారు. లాగుల్లో తొండలు ఇడుస్తా.. పేగులు తీసి మెడలో వేసుకుంటానని అంటారని అన్నారు. రాష్ట్రం అప్పుల పాలైందని రేవంత్ రెడ్డి పదే పదే అంటాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అప్పుపై ఒక్కోకాంగ్రెస్ నేత ఒక్కోలా మాట్లాడతారని అన్నారు. ఒకరు రూ.6లక్షల కోట్లు, మరొకరు 7 లక్షల కోట్లు.. ఇంకొకరు 8లక్షల కోట్లు అని చెప్పారని తెలిపారు. దీనిపై బీజేపీ ఎంపీ కేంద్రాన్ని అడిగితే.. కేసీఆర్ రూ.2లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశారని చెప్పారని గుర్తుచేశారు. కాగ్ చెప్పిన లెక్కల ప్రకారం బీఆర్ఎస్ చేసిన అప్పు 2లక్షల 80 వేల కోట్లు మాత్రమేనని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరిట గరీబోళ్ల ఇళ్లు కూలగొడతారు కానీ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లు మాత్రం ఈ ప్రభుత్వానికి కనబడవని మండిపడ్డారు.





ఈవార్తలు దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో శ్రీ సూర్య ధన్వంతరి ఆలయ ఫౌండర్ అండ్ చైర్మెన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వొద్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, వేముల రాజేశ్ తదితరులతో దినపత్రిక ఎడిటర్ శ్రావణ్ కుమార్.



ఈవార్తలు దినపత్రిక 2026 క్యాలెండర్ ఆవిష్కరణలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ, జగిత్యాల శ్రీ సూర్య ధన్వంతరి ఆలయ అధ్యక్షుడు ముత్యాల రాంలింగారెడ్డితో దినపత్రిక చైర్మన్ బొమ్మకంటి గంగాధర్, ఎడిటర్ శ్రావణ్ కుమార్.



## సుప్రీంకు ఈడీ - దీదీ పంచాయితీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మధ్య తలెత్తిన వివాదం కలకత్తా హైకోర్టులో రసాభాసగా మారిన నేపథ్యంలో ఇరుపక్షాలూ సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు విచారణను హైకోర్టు ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసిన నేపథ్యంలో ఈడీ నిన్న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. బొగ్గు స్కామ్ దర్యాప్తులో భాగంగా చేపట్టిన సోదాలు, ఆధారాల సేకరణను సీఎం మమతా బెనర్జీ మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు అడ్డుకున్నారని ఈడీ తన పిటిషన్‌లో ఆరోపించింది. మరో నాలుగు నెలల్లో పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార టీఎంసీ పార్టీ ఎన్నికల వ్యూహాల కోసం పనిచేస్తున్న ఐ-ప్యాక్ సంస్థ కార్యాలయం, ఆ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్ ఇంట్లో గురువారం ఈడీ సోదాలు నిర్వహించడం తీవ్ర కలకలాన్ని రేపింది. అయితే తమ ఎన్నికల వ్యూహాలను దోచుకునేందుకే ఈడీ ఈ దాడులు చేపట్టిందని టీఎంసీ ఆరోపించింది. ఈడీ చర్యలకు నిరసనగా మమతా బెనర్జీ భారీ ప్రదర్శన కూడా నిర్వహించారు. సోదాల సమయంలో జరిగిన వరుస ఘటనలను ఈడీ తన పిటిషన్‌లో వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను 'బలప్రదర్శన'గా అభివర్ణిస్తూ, పోలీసులు సహా రాష్ట్ర అధికారులు జోక్యం చేసుకోవడం వల్ల బొగ్గు స్మగ్లింగ్ కేసు దర్యాప్తు సమగ్రత దెబ్బతిన్నట్టేనని పేర్కొంది. స్వేచ్ఛాయుతంగా, స్వతంత్రంగా దర్యాప్తు జరిపే తమ హక్కును రాష్ట్ర యంత్రాంగం హరించిందని ఆక్షేపించింది. ఈ ఘటనలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. బొగ్గు స్కామ్‌కు సంబంధించిన రూ.20 కోట్లను హవాలా మార్గాల ద్వారా ఐ-ప్యాక్‌కు మళ్లించినట్టు కీలక ఆధారాలు లభించాయని ఈడీ తెలిపింది. అయితే సోదాల సమయంలో ప్రతీక్ జైన్ ఇంట్లోకి మమత ప్రవేశించి కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలను లాక్కెళ్లారని ఆరోపించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద జరుగుతున్న సోదాల్లో జోక్యం చేసుకోవద్దని కోరినప్పటికీ, మమత పోలీసుల సాయంతో బలవంతంగా ఆధారాలను తీసుకెళ్లారని పేర్కొంది. ఐదుగురు సాక్షులను కూడా 'సమర్థవంతంగా హైజాక్' చేశారని ఆరోపించింది. స్వాధీనం చేసుకున్న పత్రాలు, డిజిటల్ పరికరాలను వినియోగించకుండా, తొలగించకుండా లేదా మార్పుచేర్పులు చేయకుండా మధ్యంతర ఆదేశాలు ఇవ్వాలని ఈడీ కోరింది. ఇదే సమయంలో, తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలూ జారీ చేయవద్దని కోరుతూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కెవియెట్ దాఖలు చేసింది. కోల్‌కతాలోని ప్రతీక్ జైన్ నివాసం, నగర శివారులోని మరో కార్యాలయంలో ఈడీ సోదాలను వ్యతిరేకిస్తూ మమతా బెనర్జీ శుక్రవారమే రెండు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. తమ పార్టీ ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన కీలక పత్రాలను ఈడీ చోరీ చేసిందని ఆమె ఆరోపించారు. ఆ ఫిర్యాదుల ఆధారంగా కోల్‌కతా, బిధన్‌నగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కాగా, వాటిపై పోలీసులు నిన్న దర్యాప్తు ప్రారంభించారు. ఇరువర్గాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఎటువంటి ఉత్తర్వులు వెలువడతాయనేది ఆసక్తికరంగా మారింది.





# తెలంగాణ ఆత్మగౌరవం మేడారం జాతర

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి**

ములుగు, జనవరి 11 (ఈవార్తలు): తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక సమ్మక్క-సారలమ్మ జాతర అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం సాయంత్రం మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి మేడారంలో జాతర ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించిన ప్రపంచానికి పరిచయం చేస్తామన్నారు. జాతర కోసం ప్రభుత్వం రూ. 260 కోట్లు కేటాయించిందని వెల్లడించారు. జాతర నిర్వహణకు రూ.150 కోట్లు, శాశ్వత ఆలయ నిర్మాణ పనులకు రూ.110 కోట్లు కేటాయించినట్లు వివరించారు. ఈనెల 15వ తేదీలోగా అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమ్మక్క-సారలమ్మ జాతర కేవలం గిరిజన పండుగ మాత్రమే కాదని, అది తెలంగాణ హృదయ స్పందన అని పేర్కొన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర యొక్క ప్రత్యేకతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని వెల్లడించారు. పనులు దాదాపు పూర్తి కావచ్చాయని, ఇప్పటికే 85 శాతం ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. జాతర పూర్తయ్యే వరకు ఆరోగ్య, విద్యుత్ శాఖల అధికారులతో పాటు అన్ని శాఖల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దేవతమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు.



# ముందు మీ పార్టీకి మహిళను అధ్యక్షురాలిని చెయ్!

**ఒవైసీ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి కౌంటర్**


కరీంనగర్, జనవరి 11 (ఈవార్తలు): భవిష్యత్తులో హిజాబ్ ధరించిన మహిళ భారత ప్రధాని అవుతారంటూ ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటుగా స్పందించారు. హిజాబ్ ధరించిన మహిళ ప్రధాని కావడం గురించి కలలు కనే ముందు, బురఖా ధరించిన మహిళను మీ పార్టీకి అధ్యక్షురాలిగా నియమించే ధైర్యం చూపాలని ఆయన ఒవైసీకి సవాల్ విసిరారు. ఆదివారం నాడు 'ఎక్స్' వేదికగా బండి సంజయ్ ఈ మేరకు స్పందించారు. "ఎంఐఎం పార్టీ ఇప్పటివరకు ఎంతమంది ముస్లిం మహిళలకు ఎమ్మెల్యే లేదా ఎంపీ టికెట్లు ఇచ్చింది? పార్టీలో కీలక నిర్ణయాలు తీసుకునే పదవుల్లో ఎంతమంది మహిళలు ఉన్నారు?" అని ఆయన ప్రశ్నించారు. కేవలం నినాదాలతో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించినట్టు కాదని విమర్శించారు. 2018 ఎన్నికల్లో పాతబస్తీలో అక్బరుద్దీన్ ఒవైసీపై బీజేపీ తరఫున షాజాదీ సయ్యద్‌ను నిలబెట్టామని, అప్పుడు ఆమెను బెదిరించి ఓడించారని ఆరోపించారు. ప్రస్తుతం ఆమె జాతీయ మైనారిటీ కమిషన్‌లో సేవలందిస్తున్నారని గుర్తుచేశారు. సాధికారత గురించి మాట్లాడే ఒవైసీ, పార్టీలోనూ, ఇంట్లోనూ మహిళలపై ఆంక్షలు విధిస్తారని సంజయ్ విమర్శించారు. ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళల పేరిట సంక్షేమ పథకాలు, గ్యాస్ కనెక్షన్లు, గృహాలు వంటి సంస్కరణలతో ముస్లిం మహిళలకు నిజమైన సాధికారతను అందించింది బీజేపీ ప్రభుత్వమేనని బండి సంజయ్ పేర్కొన్నారు. చాలామంది ముస్లిం మహిళలు ప్రధాని మోదీని తమ సోదరుడిగా భావిస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం అన్ని వర్గాల వారికి సమాన హోదా కల్పించిందని, అందుకే పాకిస్థాన్‌లా కాకుండా ఇక్కడ హిజాబ్ ధరించిన మహిళ కూడా ప్రధాని కాగలరని అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే.

# భారత్‌పై దాడులకు వేలమంది బాంబర్లు

**కలకలం రేపుతున్న మసూద్ అజహర్ ఆడియో**




న్యూఢిల్లీ: జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజహర్‌దిగా చెబుతున్న ఓ కొత్త ఆడియో రికార్డింగ్ ఆదివారం ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. భారత్‌పై దాడులకు వేలాది మంది ఆత్మాహుతి దళ సభ్యులు సిద్ధంగా ఉన్నారంటూ అందులో చేసిన హెచ్చరికలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆడియో క్లిప్‌లో, వెయ్యి మందికి పైగా ఆత్మాహుతి బాంబర్లు ఏ క్షణంలోనైనా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని అజహర్ చెప్పినట్టుగా ఉంది. "వీళ్లు ఒకరు, ఇద్దరు, వంద కాదు.. వెయ్యి మంది కూడా కాదు. అసలు సంఖ్య చెబితే ప్రపంచ మీడియాలో రేపు పెను సంచలనం అవుతుంది" అని అందులో హెచ్చరించాడు. తమ యోధులు ప్రాపంచిక సుఖాల కోసం కాకుండా 'షహాదత్' (అమరత్వం) కోసం సిద్ధంగా ఉన్నారని కూడా ఆ వాయిస్ పేర్కొంది. అయితే, ఈ ఆడియో రికార్డింగ్ ఎప్పటిది, దీని ప్రామాణికత ఎంతవరకు నిజమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిని స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన మసూద్ అజహర్, పాకిస్థాన్ గడ్డపై నుంచి భారత్‌పై విషం చిమ్ముతూ అనేక ఉగ్రదాడులకు కుట్ర పన్నిన విషయం తెలిసిందే. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో సహా పలు భారీ ఉగ్రవాద ఘటనలకు ఇతడే ప్రధాన సూత్రధారి. 'ఆపరేషన్ సిందూర్'లో భారత బలగాల చేతిలో భారీగా నష్టపోయిన తన సంస్థకు మళ్లీ ఊపు తేవడానికే అజహర్ ఈ బెదిరింపులకు దిగి ఉంటాడని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం ప్రచారం కోసం చేస్తున్న ఓ ఉత్తుత్తి బెదిరింపుగానే వారు అభివర్ణిస్తున్నారు.



# అన్వేషకు ఇస్రో రెడీ

**కొనసాగుతున్న కౌంట్ డౌన్.. పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌తో ప్రయోగం**

**నేడు ఉదయం 10:17 గంటలకు నింగిలోకి**

శ్రీహరికోట, జనవరి 11 (ఈవార్తలు): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) రూపొందించిన 'అన్వేష' భూపరిశీలన ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జనవరి 12వ తేదీ ఉదయం 10:17 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు సంబంధించిన 22.5 గంటల కౌంట్‌డౌన్ ఆదివారం మధ్యాహ్నం 12:17 గంటలకు మొదలైంది. 'అన్వేష' ఉపగ్రహం దేశ రక్షణ, వాతావరణ అధ్యయన రంగాల్లో అత్యంత కీలకం కానుంది. హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీతో పనిచేసే ఈ ఉపగ్రహం భూమి ఉపరితలాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలించగలదు. దీని ద్వారా సరిహద్దుల వద్ద పర్యవేక్షణ, వ్యూహాత్మక నిఘా కార్యకలాపాలకు కీలక సమాచారం అందుతుంది. అంతేకాకుండా, వాతావరణ మార్పులను అధ్యయనం చేయడం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీ చేయడంలో ఇది సహాయపడనుంది. ఈ మిషన్‌లో 'అన్వేష' ప్రధాన ఉపగ్రహం కాగా, దీనితో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కూడా ఒకేసారి నింగిలోకి పంపుతున్నారు. వీటిలో 7 దేశీయ, 8 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'టేక్‌మీ2స్పేస్' రూపొందించిన ఉపగ్రహం కూడా వీటిలో ఉండటం విశేషం. పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ మిషన్. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుండగా, ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రయోగంపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## యూపీఎస్సీ పరీక్షలకు ఇకపై ఫేస్ అథెంటికేషన్

న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) తమ పరీక్షల నిర్వహణలో కీలక మార్పుకు శ్రీకారం చుట్టింది. పరీక్షల్లో పారదర్శకతను పెంచి, అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఇకపై యూపీఎస్సీ నిర్వహించే అన్ని ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఫేస్ అథెంటికేషన్ (ముఖ గుర్తింపు) తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. "యూపీఎస్సీ పరీక్షలకు హాజరయ్యే ప్రతీ అభ్యర్థికి పరీక్షా కేంద్రంలో ఫేస్ అథెంటికేషన్ నిర్వహిస్తాం" అని అధికారిక ప్రకటనలో స్పష్టం చేసింది. పీటీఐ వార్తా సంస్థ కథనం ప్రకారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఫేషియల్ అథెంటికేషన్ టెక్నాలజీని యూపీఎస్సీ ఇప్పటికే ప్రయోగాత్మకంగా పరీక్షించింది. 2025 సెప్టెంబర్ 14న జరిగిన ఎన్‌డీఏ (నేషనల్ డిఫెన్స్ అకాడమీ), ఎన్ఏ (నావల్ అకాడమీ) ××, సీడీఎస్ (కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్) ×× పరీక్షల్లో ఈ పైలట్ ప్రోగ్రాంను విజయవంతంగా నిర్వహించింది. గురుగ్రామ్‌లోని ఎంపిక చేసిన కేంద్రాల్లో అభ్యర్థుల ముఖాలను డిజిటల్‌గా స్కాన్ చేసి, వారి దరఖాస్తు ఫారాల్లోని ఫొటోలతో సరిపోల్చారు. ఈ కొత్త విధానంపై యూపీఎస్సీ ఛైర్మన్ అజయ్ కుమార్ మాట్లాడుతూ, దీనివల్ల ఒక్కో అభ్యర్థి వెరిఫికేషన్ సమయం సగటున 8 నుంచి 10 సెకన్లకు తగ్గిందని తెలిపారు. ఇది సమయం ఆదా చేయడంతో పాటు పరీక్షలకు అదనపు భద్రతను అందిస్తుందని వివరించారు. దేశంలో ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ సహా పలు నియామక పరీక్షలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## ఎక్స్‌లో 3,500 పోస్టులు బ్లాక్

**600 అకౌంట్ల తొలగింపు**

న్యూఢిల్లీ: సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)పై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ప్లాట్‌ఫామ్‌లో అశ్లీలతను ప్రోత్సహించే విధంగా ఉన్న కంటెంట్‌ను తొలగించాలని ఆదేశించడంతో ఎక్స్ యాజమాన్యం చర్యలకు ఉపక్రమించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటివరకు 3,500కు పైగా పోస్టులను బ్లాక్ చేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించిన 600కు పైగా అకౌంట్లను ఎక్స్ తొలగించింది. ముఖ్యంగా ఎక్స్ ఏఐ సర్వీస్ 'గ్రోక్' ద్వారా అసభ్యకరమైన, అశ్లీల చిత్రాలు, వీడియోలు సృష్టించబడుతున్నాయని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ గత వారం ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై జనవరి 2నే స్పందించిన ప్రభుత్వం.. మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్న కంటెంట్‌ను తక్షణమే తొలగించాలని, లేనిపక్షంలో ఐటీ చట్టం కింద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ క్రమంలోనే ఎక్స్ సంస్థ తన 'కంటెంట్ మోడరేషన్' ప్రక్రియను మరింత బలోపేతం చేస్తామని కేంద్రానికి నివేదించింది. భారతీయ నిబంధనలకు కట్టుబడి ఉంటామని, భవిష్యత్తులో గ్రోక్ ఏఐ లేదా ఇతర సేవల ద్వారా ఇలాంటి చట్టవిరుద్ధమైన కంటెంట్ సర్క్యులేట్ కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. ఐటీ చట్టం 2000, ఐటీ రూల్స్ 2021లోని నిబంధనలను పాటించడం తప్పనిసరి అని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది.

# 6 రోజుల్లో 52 కి.మీ రోడ్డు నిర్మాణం

## 4 గిన్నిస్ రికార్డులు నమోదు.. ఏపీ జాతీయ రహదారి నిర్మాణంలో సరికొత్త రికార్డులు

పుట్టపర్తి, జనవరి 11 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి నిర్మాణ పనులు రికార్డు స్థాయిలో దూసుకెళుతున్నాయి. బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ నిర్మాణంలో భాగంగా నేషనల్ హైవే అథరిటీ (ఎన్‌హెచ్ఏఐ) మరో రెండు గిన్నిస్ రికార్డులను సొంతం చేసుకుంది. కేవలం 6 రోజుల్లో 52 కిలోమీటర్ల (156 లేన్ కిలోమీటర్లు) మేర రహదారిని నిర్మించి ఈ ఘనత సాధించింది. సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గ పరిధిలోని వానవోలు-వంకరకుంట-ఓదులపల్లె సెక్షన్‌లోని ప్యాకేజ్-2, 3 పనుల్లో ఈ రికార్డులు నమోదయ్యాయి. ఈ నెల 6వ తేదీ ఉదయం 10.07 గంటల నుంచి 11వ తేదీ ఉదయం వరకు నిరంతరాయంగా పనులు చేపట్టారు. ఈ క్రమంలో రికార్డు స్థాయిలో 57,500 మెట్రిక్ టన్నుల కాంక్రీటును వేయడం, అత్యంత వేగంగా పేవింగ్ పూర్తి చేయడం ద్వారా రెండు విభాగాల్లో గిన్నిస్ రికార్డులు దక్కాయి. ఈ బృహత్కార్యం కోసం కాంట్రాక్ట్ సంస్థ రాజ్ పథ్ ఇన్ఫ్రాకాన్.. 70 టిప్పర్లు, 5 మిక్సింగ్ ప్లాంట్లు, 17 రోలర్లను వినియోగించింది. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో ఈ పనులను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇదే సంస్థ గతంలో ఒక్క రోజులో 28.896 లేన్ కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించి రెండు గిన్నిస్ రికార్డులు సాధించింది. తాజా విజయంతో బెంగళూరు-విజయవాడ ఎకనమిక్ కారిడార్‌కు మొత్తంగా నాలుగు గిన్నిస్ రికార్డులు లభించినట్లయింది. ఈ రికార్డు విజయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌హెచ్ఏఐ, రాష్ట్ర అధికారులు, రాజ్ పథ్ ఇన్ఫ్రాకాన్ సంస్థకు ఆయన అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎకనామిక్ కారిడార్‌కు సంబంధించిన మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని సూచించారు.





## సీనియర్ జర్నలిస్టు ఫజల్ రెహమాన్‌కు ఘన నివాళి

జగిత్యాల, జనవరి 11 (ఈవార్తలు): సీనియర్ జర్నలిస్టు ఫజల్ రెహమాన్ మృతికి ధర్మపురి ప్రెస్ క్లబ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళు లర్పించింది. ఆదివారం రాత్రి పట్టణంలోని నంది చౌరస్తా వద్ద ఫజల్ రెహమాన్ చిత్రపటానికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జర్నలిజానికి, ముఖ్యంగా గ్రామీణ జర్నలిజం అభివృద్ధికి అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురేందర్ కుమార్, ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధుమహదేవ్, యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యురాలు పవిత్ర, ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని ఫజల్ రెహమాన్ సేవలను స్మరించారు. ఆయన లేని లోటు జర్నలిజం రంగానికి తీరని నష్టమని వారు పేర్కొన్నారు.



## ముత్యంపేట బజరంగ్ సేన నూతన కార్యవర్గం ఎన్నిక

మల్యాల, జనవరి 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట - కొండగట్టు గ్రామంలో బజరంగ్ సేన యూత్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బాలె భగవాన్, ఉపాధ్యక్షుడిగా ఎండీ సుల్తాన్, కోశాధికారిగా పొనగంటి విష్ణువర్ధన్ ప్రధాన కార్యదర్శిగా చింతలతాడెం గణేశ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా జగిత్యాల అక్షయ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



## అంబేడ్కర్ యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

మల్యాల, జనవరి 11 (ఈవార్తలు): మల్యాల మండలంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో గౌరవ అధ్యక్షుడు నక్క రాజయ్య, అధ్యక్షుడు పూడూరు గంగస్వామి, ఉపాధ్యక్షుడు నక్క సురేశ్, ప్రధాన కార్యదర్శి ముద్దుమల్ల స్వామి, మ్యాథరి వంశీవర్ధన్, ఆకుల బాబయ్య, కొంపెల్లి శేఖర్, శనిగరపు తిరుపతి, మాకుగల వెంకటస్వామి, ముద్దమల్ల శంకర్, గుడిసె రవి, బుల్లి కిషన్ తదితరులను సభ్యులు ఎన్నుకున్నారు.



## ముగ్గులపోటీ కరపత్రం ఆవిష్కరణ

రామన్నపేట, జనవరి 11 (ఈవార్తలు): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ముగ్గుల పోటీ కరపత్రాన్ని స్థానిక సర్పంచ్ బండ సరోజ ఆవిష్కరించారు. ఈ నెల 14న మండలంలోని జనంపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. బుధవారం రోజు సాయంత్రం ముగ్గుల పోటీలు ఉంటాయని, గ్రామ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మొదటి బహుమతిగా రూ.5016, రెండవ బహుమతి 3016 రూపాయలు, మూడవ బహుమతి 2016 రూపాయలు ఉంటాయని పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు సంక్రాంతి కానుకలు

## కొత్త బెల్లం... అప్పన్న క్యాలెండర్.. ప్రత్యేక బహుమతులు అందించిన గంట్ల

అక్కయ్యపాలెం, జనవరి 11 (ఈవార్తలు): సంక్రాంతి పర్వదినాన్ని జర్నలిస్టులంతా ఆనందమయంగా జరుపుకోవాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు, డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షించారు. పెద్ద పండుగ సందర్భంగా ఆదివారం అక్కయ్యపాలెంలోని ఒక ప్రయివేటు కార్యాలయంలో జర్నలిస్టులకు గంట్ల శ్రీనుబాబు చేతులు మీదుగా కానుకలు అందజేశారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఒక్కొక్కరికి మూడు కేజీలు కొత్తబెల్లం, సింహాచలం అప్పన్న అలంకరణలతో కూడిన 2026 క్యాలెండర్ , అలాగే ప్రత్యేక బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తన సొంత నిధులతోనే ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రసాయనాలు మిలితం కాని 1500 కేజీల బెల్లం పూజాది కార్యక్రమాలకు వినియోగించుకునే విధంగా జర్నలిస్టులకు అందజేస్తున్నామన్నారు. అలాగే



సింహాద్రినాధుడు అలంకరణలతో కూడిన క్యాలెండర్ అందజేశామన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టుల సంక్షేమానికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని గంట్ల శ్రీనుబాబు చెప్పారు.. జర్నలిస్టులకు అక్రిడేషన్లు.. ఇళ్ల స్థలాలు.. పెన్షన్ అమలుతో పాటు 11 డిమాండ్లతో ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లకు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు.. అలాగే సంక్రాంతి తర్వాత మరోసారి ముఖ్యమంత్రిని కలిసి జర్నలిస్టు సమస్యలపై తమ యూనియన్ ద్వారా విన్నవించడం జరుగుతుందన్నారు.. పలు సమస్యలు పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు

# అలిశెట్టి అక్షరాలు సమాజ హితానికే అంకితం

### పెద్దింటి అశోక్ కుమార్

జగిత్యాల, జనవరి 11 (ఈవార్తలు): అలిశెట్టి ప్రభాకర్ రచనలు కణికల వంటి పదునుతో సమాజ హితాన్ని కోరాయని, యువతరానికి అవి ఆదర్శంగా నిలిచాయని సినీ కథ రచయిత, అలిశెట్టి జీవిత సాఫల్య పురస్కార గ్రహీత పెద్దింటి అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో 'అక్షర సూరీడు' అలిశెట్టి ప్రభాకర్ జయంతి--వర్ధంతి కార్యక్రమం స్థానిక శివసాయి రెసిడెన్సీలో నిర్వహించారు. ఈ సందర్భంగా అలిశెట్టి చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, తాజా మాజీ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అలిశెట్టి సాహిత్య అవార్డులను ఉరిమల్ల సునంద, లక్కరాజు శ్రీలక్ష్మి, మేరుగు అనూరాధ, మాదురి అనిత, కోరుకంటి కిరణ్మయి, మద్దెల ప్రభాకర్, నవీన్లకు గాజంగి నందయ్య, అడువాల జ్యోతి లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో కవులు,



కవయిత్రుల అలిశెట్టి కవితాగానం అలరించింది. ఈ సమావేశంలో ప్రముఖ కథ రచయిత కె.వి. నరేందర్, కవయిత్రి అయిత అనిత, ఉపాధ్యాయ సంఘాల నాయకులు బోయినపల్లి ఆనందరావు, అమర్నాథ్ రెడ్డి, డాక్టర్ చిందం సునీత, వంగ గీతారెడ్డి, టి.వి. సూర్యం, గెటప్ శ్రీనువాస్, రాజా రామ్ మోహన్ రెడ్డి, ములస్తం లావణ్య, గంగం జల, రాధ, రమాదేవి, రఘు వర్మ, రుద్ర మాణిక్యం, సింగం పద్మ తదితరులు పాల్గొన్నారు.



## మహిళలకు విద్యే ఆభరణం

### స్ఫూర్తి ప్రదాత సావిత్రీబాయి పూలే

అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి

హైదరాబాద్,జనవరి 11 (ఈవార్తలు): మహిళలకు విద్యే ఆభరణం కావాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి అన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం మహిళా విభాగం, పద్మశాలి అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నారాయణగూడ లోని పద్మశాలి భవన్ లో సావిత్రిబాయి పూలే 195వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ విద్యావంతురాలు కావాలని కలలు కన్న ధీర మహిళ సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప మానవతావాది సావిత్రీ బాయి పూలే అని అన్నారు. పూలే దంపతులను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వంగరి త్రివేణి, సోమ కవిత, డాక్టర్ గీత వెంకట్, మిర్యాల విశ్వరేఖ, గుంటక రూప, శశికళ, పోరండ్ల శారధ, మోతుకూరి విజయలక్ష్మి, రేణుక పులిజాల, కృష్ణ సంతోషి, కీర్తన, అర్చన, శాంతి, సంతోషి, నిర్మల, అరసనపల్లి, శారద, కొక్కుల దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపల్ పీఠం బీజేపీదే

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి



జగిత్యాల, జనవరి 11 (ఈవార్తలు): జగిత్యాల్ మున్సిపల్ ఎన్నికలలో మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని ఉమాశంకర్ గార్డెన్స్‌లో జగిత్యాల నియోజకవర్గ మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు గారితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గారి ఆధ్వర్యంలో ప్రతి ఒక్క బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోబోతున్నామని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గంలోని జగిత్యాల, రాయికల్ మున్సిపాలిటీలకు అర్వింద్ రూ.75 కోట్ల నిధులు అమృత్ 2.0 పథకం ద్వారా మంజూరు చేయించారని అన్నారు. యాదగిరి బాబు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త పై ఉందని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులు తమ వార్డులలో తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించి, బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షుడు కొక్కుల గంగాధర్, రాయికల్ మండల అధ్యక్షుడు కుర్మా మల్లారెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కోకన్వీనర్ మిట్టపల్లి సాయికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, జిల్లా కోశాధికారి సుంకట దశరథ్ రెడ్డి, రగిల్ల సత్యనారాయణ, జిల్లా, మండల పదాధికారులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.కోటితో ధన్వంతరి ఆలయానికి సీసీ రోడ్డు

### శంకుస్థాపన చేసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 11 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని ఎల్ఎల్ గార్డెన్ నుంచి ధన్వంతరి ఆలయం వరకు యూడీఎఫ్ఐసీ నిధులు రూ.కోటితో సీసీ రోడ్డు పనులకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు గిరి నాగభూషణం, అడువాల జ్యోతి లక్ష్మణ్, ముత్యాల రాంలింగారెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఆరుముల్ల నర్సమ్మ, షకీల్, కప్పల శ్రీకాంత్, పిట్ట ధర్మరాజు, నాయకులు అరుముల్ల పవన్, చిక్కుల భూమయ్య, వార్డు పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## ముగ్గు వేయ్.. బహుమతి పట్టేయ్!

మల్యాల, జనవరి 11 (ఈవార్తలు): సంక్రాంతి పండగ పురస్కరించుకొని మల్యాల మండల కేంద్రంలో ఆదివారం దొంతరవేణి లావణ్య శేఖర్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో 12 మంది మహిళలు పాల్గొనగా, ముగ్గురు విజేతలుగా నిలిచారు. గడుగు శివాత్మిక -మొదటి బహుమతి (రూ.3000), కొక్కుల పూజిత - రెండో బహుమతి (రూ.2000), మ్యాదరి శ్యామల - మూడో బహుమతి (రూ.1000) గెలుచుకున్నారు.



## ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పల్లకి సేవ

జగిత్యాల, జనవరి 11 (ఈవార్తలు): అష్టమి పర్వదినాన్ని పురస్కరించుకొని జగిత్యాలలోని శ్రీ సూర్య ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించారు. స్వామి వారికి ముడుపు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వడ్లగట్ట శంకర్, సహాయ కార్యదర్శి భారతాల రాజసాగర్, వేముల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉచితంగా అమృత నిర్గుండి కషాయ వితరణ

అన్ని రకాల వ్యాధులను నయం చేసేందుకు ధన్వంతరి ఆలయం వద్ద పలు మూలికలతో తయారుచేసిన అమృత నిర్గుండి కషాయాన్ని భక్తులకు ఉచితంగా అందజేసినట్లు ఆలయ ఫౌండర్, చైర్మన్ వడ్లగట్ట రాజన్న తెలిపారు. ప్రతి ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కషాయాన్ని ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని భక్తులు ఉపయోగించుకొని, వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.

# యుగపురుషుడు..



# స్వామి వివేకానంద

భారతదేశం నేడు ప్రపంచంలోనే అత్యంత పిన్న వయస్కులు ఉన్న దేశం.

దేశ భవిష్యత్తును నిర్దేశించగల అపారమైన మానవ వనరులు మన సొంతం.

అయితే, ఆధునిక ప్రపంచంలో యువత ఎదుర్కొంటున్న మానసిక ఆందోళనలు, లక్ష్య రాహిత్యం మరియు విలువల క్షీణత ఒక పెద్ద సవాలుగా మారాయి.



ఈ క్లిష్ట సమయంలో, నూట యాభై ఏళ్ల క్రితం ఒక తుపానులా వచ్చి ప్రపంచాన్ని మేల్కొల్పిన స్వామి వివేకానంద ఆలోచనలు నేటి యువతకు అత్యవసరం. వివేకానంద బోధనల్లో పరమ సత్యం-ఆత్మవిశ్వాసం. ఆయన ఏనాడూ మనిషిని పాపాత్ముడు అని పిలవలేదు; అమృతుడి పుత్రులు అని సంబోధించారు.

'నీ మీద నీకు నమ్మకం లేనప్పుడు, నీవు ముప్పై మూడు కోట్ల దేవతలను నమ్మినా ప్రయోజనం లేదు' అని ఆయన కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. నేటి యువత చిన్నపాటి వైఫల్యాలకే కుంగిపోతున్నారు. మార్కుల వేటలోనో, ఉద్యోగ పోటీలోనో వెనుకబడితే జీవితం ముగిసిపోయిందని భావిస్తున్నారు. కానీ, వివేకానంద దృష్టిలో ఓటమి అంటే నేర్చుకునే ఒక పాఠం మాత్రమే. అపరిమితమైన శక్తి నీలోనే ఉందని గుర్తించడమే వివేకానంద తత్త్వం.

నేడు యువత ముందున్న అతిపెద్ద సమస్య పరధ్యానం. సోషల్ మీడియా, గ్యాడ్జెట్లు మరియు అనవసరపు సమాచార ధాటికి యువత ఏకాగ్రత దెబ్బతింటోంది. 'ఒక ఆశయాన్ని తీసుకో.. నీ రక్తం, కండరాలు, నరాలు, మెదడు అంతా ఆ ఆలోచనతో నిండిపోవాలి. ఇతర ఆలోచనలన్నింటినీ పక్కన పెట్టేయ్. ఇదే విజయానికి మార్గం' అని ఆయన బోధించారు. ఏ రంగంలోనైనా నిష్ణాతులు కావాలంటే ఏకాగ్రత ఎంత అవసరమో ఆయన తన జీవితం ద్వారా నిరూపించారు.



చదువుతున్నప్పుడు చదువుపైనే, పనిచేస్తున్నప్పుడు పనిపైనే మనసును నిలపడం నేటి తరం ఆయన నుంచి నేర్చుకోవాల్సిన ప్రాథమిక సూత్రం. 'గీతా పారాయణం కంటే ఫుట్‌బాల్ ఆడటం ద్వారా మీరు స్వర్గానికి చేరువవుతారు' అన్న వివేకానంద మాటలు నేటికీ విప్లవాత్మకమైనవే. బలహీనమైన శరీరంతో బలమైన ఆలోచనలు చేయలేము. ఉక్కు నరాలు, ఇనుప కండరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత నేడు దేశానికి కావాలి. యోగా, వ్యాయామం ద్వారా శరీరాన్ని దృఢంగా ఉంచుకోవడం ఆధ్యాత్మికతలో ఒక భాగమేనని ఆయన నిరూపించారు. ఆరోగ్యకరమైన శరీరంలోనే ఆరోగ్యకరమైన మనస్సు నివసిస్తుంది. వివేకానంద కేవలం వ్యక్తిగత మోక్షం కోసం పరితపించలేదు. "ఏ దేశంలో అయితే కోట్లాది మంది ఆకలితో, అజ్ఞానంతో అలమటిస్తున్నారో.. ఆ దేశంలో వారి ఖర్చుతో విద్యను అభ్యసించి వారిని పట్టించుకోని ప్రతి ఒక్కడినీ నేను ద్రోహిగానే భావిస్తాను" అన్న ఆయన మాటలు నేటి యువతను హెచ్చరిస్తున్నాయి. యువత కేవలం తమ కెరీర్, జీతం, హోదా గురించి మాత్రమే కాకుండా, సమాజం పట్ల బాధ్యతను కలిగి ఉండాలి. పేదలకు, అట్టడుగు వర్గాలకు సేవ చేయడమే భగవంతుడికి చేసే అసలైన పూజ అని ఆయన చాటి చెప్పారు. వివేకానంద విజ్ఞాన శాస్త్రాన్ని, ఆధ్యాత్మికతను వేర్వేరుగా చూడలేదు. పాశ్చాత్య దేశాలలోని పనితనం, క్రమశిక్షణ, సాంకేతికతను తీసుకోవాలని చెబుతూనే.. మన దేశంలోని వేదాంతాన్ని, మానవతా విలువలను కాపాడుకోవాలని చెప్పారు. ఆయన చికాగో ప్రసంగం ద్వారా భారతీయుల ఆత్మగౌరవాన్ని ప్రపంచ యవనికపై నిలబెట్టారు. నేటి యువత విదేశీ సంస్కృతిని అనుసరిస్తూనే, తమ మూలాలను మర్చిపోకుండా ఉండడమే ఆయనకు ఇచ్చే గౌరవం. 'లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకు విశ్రమించకండి!' అనే నినాదం కేవలం మాటలు కావు, అవి అగ్ని కణాలు. భయపడకుండా, వెనుకాడకుండా లక్ష్యం వైపు దూసుకుపోయే గుణం యువతలో రావాలి. ప్రతి యువకుడిలోనూ ఒక వివేకానందుడు నిద్రపోతున్నాడు, ఆ శక్తిని తట్టి లేపడమే నేటి అవసరం. స్వామి వివేకానంద చూపిన బాటలో నడిచి, ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం ద్వారానే మనం ఆయన కలలుగన్న 'విశ్వగురువు' స్థానానికి భారతదేశాన్ని తీసుకెళ్లగలం.

**- గంగాధర్ బొమ్మకంటి**

---

# అక్షరమే అస్త్రం..

# అలిశెట్టి

అలిశెట్టి ప్రభాకర్.. అక్షరంపై ఎక్కుపెట్టిన అస్త్రం, సామాన్యుడి వేదనకు నిలువుటద్దం. ఆయన కేవలం ఒక కవి మాత్రమే కాదు, ఒక సామాజిక వైద్యుడు. సమాజంలో పేరుకుపోయిన కుళ్లును తన కవిత్వమనే శస్త్రచికిత్సతో సరిచేయడానికి ప్రయత్నించిన అరుదైన సృజనశీలి. తెలుగు సాహితీవనంలో ఎందరో కవులు పూశారు, కానీ కొందరు మాత్రమే కాలం గడిచినా వాడిపోని పరిమళాన్ని వెదజల్లుతారు.



అలాంటి వారిలో అలిశెట్టి ప్రభాకర్ అగ్రగణ్యుడు. "సిటీ లైఫు పేరుతో హైదరాబాద్ నగర జీవనంలోని వైరుధ్యాలను, మధ్యతరగతి మనుషుల మౌన రోదనలను ప్రపంచానికి చాటిచెప్పిన ధీశాలి ఆయన. అలిశెట్టి ప్రభాకర్ గొప్పదనం ఆయన ఎంచుకున్న వస్తువులో ఉంది. ఆయన ఎప్పుడూ ఆకాశంలోని చందమామ గురించి లేదా అందమైన ప్రకృతి గురించి కవిత్వం రాయలేదు. అట్టడుగు వర్గాల ఆకలి, నిరుద్యోగుల నిరాశ, వేశ్యల కన్నీళ్లు, నగరపు హోరులో నలిగిపోతున్న సామాన్యుడి బతుకు చిత్రాలే ఆయన కవిత్వానికి ముడిసరుకు. అతి తక్కువ పదాలతో అనంతమైన అర్థాన్ని చెప్పడం ప్రభాకర్ శైలి. చురకలు అంటించే ఆయన 'మినీ కవితలు' సమాజంలోని అన్యాయాలపై తూటాల్లా పేలాయి. అలిశెట్టి కేవలం కవి మాత్రమే కాదు, గొప్ప చిత్రకారుడు కూడా. జగిత్యాల నుంచి హైదరాబాద్ వరకు సాగిన ఆయన ప్రయాణంలో పెయింటర్ గా, ఫొటోగ్రాఫర్ గా ఆయనకు ఉన్న అనుభవం ఆయన కవిత్వంలో కనిపిస్తుంది. ఒక చిత్రకారుడు క్యాన్వాస్ మీద రంగులతో బొమ్మ గీస్తే, అలిశెట్టి పదాలతో దృశ్యాన్ని కళ్లకు కట్టేవారు. అందుకే ఆయన కవిత చదువుతుంటే ఆ దృశ్యం మన కళ్ల ముందు కదలాడుతుంది. హైదరాబాద్‌లోని ఓ దినపత్రికలో ఆయన రాసిన 'సిటీ లైఫ్' కాలమ్ ఒక చరిత్ర. నగరమంటే కేవలం మేడలు, మిద్దెలు, రంగుల ప్రపంచం మాత్రమే కాదు.. ఆ మేకప్ వెనుక ఉన్న చీకటి కోణాలను ఆయన ఎండగట్టారు. 'ఎముకల పోగులు ఎన్నో కలిస్తే కానీ ఒక మేడ పుట్టదు' అనేది ఆయన నమ్మిన సత్యం. ధనవంతుల విలాసాలకు, పేదవాడి శ్రమకు మధ్య ఉన్న అగాధాన్ని ఆయన తన కలంతో పూడ్చడానికి ప్రయత్నించారు. అలిశెట్టి జీవితమంతా దారిద్ర్యంతోనే గడిచింది. క్షయవ్యాధి తన శరీరాన్ని లోపల నుంచి తొలిచేస్తున్నా, ఆయన తన కవిత్వాన్ని మాత్రం ఆపలేదు. తన అనారోగ్యం కంటే సమాజ రుగ్మతల గురించే ఆయన ఎక్కువగా బాధపడ్డారు. కవిత్వం అంటే కాలక్షేపం కాదు, అదొక బాధ్యత అని చాటిచెప్పారు. ఆయన రాసిన "మరణం నా చివరి చరణం కాదు" అనే మాట నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది. అలిశెట్టి రాసి దశాబ్దాలు గడిచినా, ఆయన కవిత్వం నేటికీ పాతబడలేదు. నిరుద్యోగం, అవినీతి, సామాజిక అసమానతలు నేటికీ అలాగే ఉన్నాయి. అందుకే అలిశెట్టి ప్రభాకర్ ప్రతి తరానికీ అవసరమయ్యే కవి. ఆయన కవితలు చదువుతుంటే మన సొంత బాధను ఎవరో పంచుకుంటున్నట్లు అనిపిస్తుంది. అలిశెట్టి ప్రభాకర్ భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన కవిత్వం రూపంలో నిరంతరం జీవిస్తూనే ఉంటారు. అక్షరాన్ని ఆయుధంగా మార్చుకుని, పేదరికాన్ని గెలిచి, మరణాన్ని కూడా ఎదిరించిన అక్షర యోధుడు ఆయన. తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు అలిశెట్టి పేరు ఒక సవాలుగా, ఒక ఆశగా, ఒక నినాదంగా వినిపిస్తూనే ఉంటుంది.

**- రఘు వీరబత్తిని**

### బతుకు పోరాటం:

ఫుట్‌పాత్‌ల మీద నిద్రించే అభాగ్యులు, ఆకాశహర్మ్యాల నీడలో మగ్గిపోయే మురికివాడల జీవితాలు ఆయన కవిత్వంలో సజీవంగా కనిపిస్తాయి.

### మధ్యతరగతి వేదన:

అద్దె కొంపలో అడుగుపెట్టిన రోజే, యజమాని కళ్లలో హెచ్చరిక కనిపిస్తుంది అన్నట్లుగా మధ్యతరగతి మనుషుల ఆవేదనను ఆయన అక్షరబద్ధం చేశారు.

### మినీ కవితా పితామహుడు:

అలిశెట్టి ప్రభాకర్ గొప్పదనం ఆయన వాడే సరళమైన భాషలో ఉంది. కఠినమైన పదజాలం వాడి పాండిత్యాన్ని ప్రదర్శించడం కంటే, పదునైన పదాలతో సామాన్యుడిని ఆలోచింపజేయడమే ఆయన లక్ష్యం. వారసుల కోసం ఆస్తులు వెతకడం కాదు, ఆస్తుల కోసం వారసులను వెతకడం ఈ కాలపు వింత. ఇలాంటి చిన్న చిన్న వాక్యాల్లోనే ప్రపంచ తత్వాన్ని ఇమిడ్చి చెప్పగల సత్తా ఆయనది. అందుకే ఆయన్ని తెలుగు 'మినీ కవితల పితామహుడు'గా పిలుచుకుంటాం.

### రాజీపడని క్రాంతి:

సమాజంలో ఉన్న కులతత్వం, అవినీతి, దోపిడీ వ్యవస్థలపై ఆయన అలుపెరుగని పోరాటం చేశారు. నేను రాసేది కవిత్వం కాదు, అది నా సమాజపు గాయం మీద పెడుతున్న కట్టు అని ఆయన భావించేవారు.

### స్త్రీ పక్షపాతి:

వేశ్య వృత్తిలోని మహిళల దీనస్థితిపై ఆయన రాసిన కవితలు గుండెను పిండివేస్తాయి. సమాజం వారిని చూసే చూపును ఆయన తూర్పారబట్టారు.

### కార్మిక గళం:

గనుల్లో మగ్గే కార్మికుల చెమట చుక్కలు, పారిశ్రామిక ప్రాంతాల్లో కలుషితమైన గాలి.. ఇవన్నీ ఆయన కవితా వస్తువులే.



## వయ్యారి చిత్రం



రుహీ సింగ్

# ప్రజలను లూటీ చేస్తున్నాయి



సినిమా నిర్మాతలకు సిగ్గు లేదు.. ప్రభుత్వానికి తెలివి లేదు! అని ఘాటుగా విమర్శించారు సీపీఐ నారాయణ. సినిమా నిర్మాతలు అడగ్గానే టికెట్ ధరల్ని పెంచి ప్రభుత్వాలు ప్రజలపై భారం పెనుమోపుతున్నాయని తూర్పారబట్టారు. సంక్రాంతి సినిమాలకు టికెట్ ధరలు పెంచడాన్ని ఆయన నిరసిస్తున్నారు. ఇది సినిమా వాళ్లు, ప్రభుత్వం కలిసి ప్రజల్ని దోపిడీ చేయడమేనని అభిప్రాయపడ్డారు. కోట్లు పెట్టి సినిమాలు తీసి ప్రజలపై భారం మోపుతారా? అని ప్రశ్నించారు. థియేటర్ కి వెళితే మంచి నీళ్లు, స్నాక్స్ తీసుకెళ్లనివ్వరు. అక్కడ అధిక ధరలకు అమ్ముతారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం ఆశించాలి కానీ, ఇలా దోపిడీ చేయకూడదని నారాయణ అన్నారు. థియేటర్లలో అధిక ధరలకు విక్రయించడం సినీమాఫియా, ప్రభుత్వం కలిసి కట్టుగా లూటీ చేయడమేనని అభిప్రాయపడ్డారు. సంక్రాంతి సినిమాలైన మన శంకరవరప్రసాద్ గారు, ది రాజా సాబ్ చిత్రాలకు టికెట్ ధరలు పెంచుకోవడానికి అనుమతి కోరడంపై కూడా ఆయన మండిపడ్డారు. నిర్మాతలు హీరోలకు వందల కోట్లు ఇస్తారు, కానీ ఆ భారాన్ని సామాన్య ప్రేక్షకులపై వేస్తారు. ధరలు పెంచడం అంటే పేదవాడి జేబులు కొట్టడమే! నని అన్నారు. సినిమా పరిశ్రమ కేవలం ధనవంతుల కోసం మాత్రమే అన్నట్లుగా తయారైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజల భారం తగ్గించేందుకు కృషి చేయాల్సిన ప్రభుత్వాలు ధనవంతులకు దోచి పెట్టే పనులు చేస్తున్నాయన విమర్శించారు. అలాగే సినిమా వాళ్ల వ్యక్తిగత విషయాలను కూడా సినిమాలాగా ఆర్భాటంగా చూపిస్తున్నారని కూడా సీపీఐ నారాయణ విరుచుకుపడ్డారు. ఇటీవలి ధనుష్- నయనతార గొడవను ఆయన ప్రస్తావిస్తూ ఈ విమర్శలు చేసారు. తెలుగు సినిమా నిర్మాతలకు అసలు సిగ్గు ఉందా? సెలబ్రిటీల ప్రైవసీని వ్యాపారం చేసుకుంటున్నారు. సినిమా ప్రమోషన్ల కోసం పడి చచ్చే వీరు, నటీనటుల రక్షణ గురించి ఎందుకు ఆలోచించడం లేదు? అని ప్రశ్నించారు. ఇటీవల విమానాశ్రయాల్లో, బహిరంగ ప్రదేశాల్లో జరిగిన మాబింగ్ ఘటనలను నారాయణ ప్రస్థావిస్తూ ప్రశ్నలు కురిపించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి హెూదాలో నారాయణ పేదల తరపును తన గళం విప్పుతున్నారు. గతంలో కూడా బిగ్ బాస్ షోపై, అలాగే టాలీవుడ్ డ్రగ్స్ కేసుపై తీవ్రమైన వ్యాఖ్యలు చేసి వార్తల్లో నిలిచారు. సినిమా ఇండస్ట్రీలో జరుగుతున్న అన్యాయాలపై గొంతు ఎత్తే రాజకీయ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. టికెట్ రేట్లు తగ్గించకపోతే ఐబొమ్మ రవి లాంటి వాళ్లు పుట్టుకొస్తూనే ఉంటారని, దీనికి ప్రత్యామ్నాయం ఆలోచించాల్సింది సినీపెద్దలే అని కూడా ఆయన గతంలో సూచించారు.




## టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్..

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు అరుదైన గౌరవం దక్కింది. టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ టైటిల్ ఆయన ను వరించింది. మార్షల్ ఆర్ట్స్(ప్రాచీన యుద్ధ విద్య) అంటే ఎంతో ఇష్టపడే.. పవన్ కల్యాణ్.. ఈ కళలో సుమారు 30 ఏళ్లకు పైగా సాధన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన జపాన్‌కు చెందిన కత్తిసాము(కెంజుట్స్)లో ప్రావీణ్యం సంపాయించారు. దీనిలో అధికారికంగా ఆయన అడుగు పెట్టారు. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్‌కు ఇంటర్నేషనల్ గౌరవం దక్కింది. కరాటే సహా.. యుద్ధథ రీతుల్లో పవన్ కు ఆసక్తి ఎక్కువ. గతంలో ప్రజారాజ్యం పార్టీప్రారంభించినప్పుడు.. యువ రాజ్యం పేరుతో యువతకు కర్రసాము నేర్పించారు. అలా.. ఆయన అప్పటి నుంచి ప్రవేశం పొందారు. ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌కే పరిమితం కాకుండా, జపనీస్ సమురాయ్ మార్షల్ ఆర్ట్స్‌పై దృష్టిపెట్టారు. వాటిని ఎంతో ఓర్పుగా నేర్చుకున్నారు. పవన్ కల్యాణ్ సినిమాల్లో పలు మార్షల్ ఆర్ట్స్ ఘట్టాలు కనిపిస్తాయి. ఈ క్రమంలోనే ఆయన టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ పురస్కారం లభించింది.

## మూడు పూవులు ఆరు కాయలు



కేరళ కుట్టీ సంయుక్తా మీనన్ ప్రయాణం దేదీప్యమానంగా సాగిపోతుంది. దక్షిణాదిన అన్నిభాషల్లో నటిస్తూ బిజీగా ఉంది. తెలుగు,తమిళ్, కన్నడ, మలయాళం అంటూ ఏ భాషలో అవకాశం వచ్చినా కాదనకుండా పనిచేస్తోంది. గత ఏడాది తెలుగులో ఒక్క సినిమాతోనే అలరించినా కొత్త ఏడాదిలో మాత్రం బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో అలరించడానికి రెడీ అవుతుంది. ప్రత్యేకించి అమ్మడి లైనప్ లో తెలుగు రిలీజ్ లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ సంక్రాంతి కానుకగా నారీ నారీ నడుమ మురారీ అంటూ యంగ్ హీరో శర్వాంద్ తో మెప్పించబోతుంది. అనంతరం స్వయంభూ, పూరి జగన్నాద్ చిత్రంతో పాటు మరో సినిమాతో అలరించనుంది. కోలీవుడ్ లో బెంజ్, మాలీవుడ్ లో రామ్, బాలీవుడ్ లో క్వీన్ ఆఫ్ క్వీన్స్ చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తుంది. ఇప్పటి వరకూ సంయుక్తా మీనన్ నటనకు ఆస్కారం ఉన్న పాత్రల్లోనే కనిపించింది. గ్లామర్ పాత్రల్లో బోల్డ్ గా హైలైట్ అయ్యే ఛాన్స్ మాలీవుడ్ మినహా మరే భాషలోనూ తీసుకోలేదు. ఈ విషయంలో అమ్మడు ఎంతో తెలివైన గేమ్ ఆడి సక్సెస్ అయింది. ముందే బోల్డ్ అటెంప్ట్ కి ఒకే చెప్తే.. తర్వాత ఆ పాత్రల్లో కిక్ ఉండదని భావించిన బ్యూటీ ఆ తరహా అవకాశాలు వచ్చిన వదులుకుంది. వీలైనంత వరకూ పెర్ఫార్మెన్స్ ఓరియేంటెడ్ రోల్స్ తోనే మెప్పించింది.



## భర్త మహాశయులకు విజ్ఞప్తికి యూ/ఏ సర్టిఫికెట్

మాస్ మహారాజా రవితేజ హీరోగా, కిశోర్ తిరుమల దర్శకత్వంలో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'సినిమా రాబోతుంది. ఈ సినిమాలో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. కాగా ఈ చిత్రం సెన్సార్ లాంఛనాలను పూర్తి చేసుకుని, యూ/ఏ సర్టిఫికేట్‌ను పొందిందని చిత్ర నిర్మాతలు ఈరోజు ప్రకటించారు. ఇక తాజా అప్ డేట్ ప్రకారం, ఈ సినిమా నిడివి 2 గంటల 10 నిమిషాలు అని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఈ రన్‌టైమ్ చాలా ప్లస్ కానుంది. ఇక ఈ సినిమాలో 'డింపుల్ హయతి -- ఆషిక రంగనాథ్ల పాత్రల మధ్య రవితేజ పాత్ర ఎలాంటి సమస్యలు పేస్ చేసింది అనే కోణంలో వచ్చే సీన్స్ చాలా బాగున్నాయట. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 13, 2026న రిలీజ్ కానుంది. ఈ సినిమా పై మంచి అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా సినిమాలో కామెడీ ఎలిమెంట్స్ బాగా వర్కౌట్ అయ్యాయి అని టాక్ ఉంది.

## సూపర్ ఫాంలో రుక్మిణి వసంత్



సౌత్ లో ప్రస్తుతం సూపర్ ఫాంలో ఉన్న భామ రుక్మిణి వసంత్. సప్త సాగరాలు దాటి సినిమాతో సూపర్ పాపులర్ అయిన ఈ అమ్మడు ఆ తర్వాత వరుస స్టార్ ఛాన్స్ లను అందుకుంటుంది. కాంతారా చాప్టర్ 1 లో తన రోల్ తో ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేసింది ఈ అమ్మడు. కాంతారా 1 తో రుక్మిణి వసంత్ సత్తా చాటగా ఆమె క్రేజ్ మరింత పాపులర్ అయ్యింది. అందుకే అమ్మడికి వరుస ఛాన్స్ లు ఇస్తున్నారు. ఐతే రుక్మిణి వసంత్ ప్రస్తుతం ఎన్ టీ ఆర్ డ్రాగన్ సినిమాలో ఛాన్స్ పట్టేసింది. ఆ సినిమాతో అమ్మడు ఒక రేంజ్ లో క్రేజ్ తెచ్చుకునే ఛాన్స్ ఉంది. రుక్మిణి వసంత్ యష్ తో టాక్సిక్ సినిమా ఛాన్స్ అందుకుంది.

## నిధి.. భవిష్యత్తు ఏంటో!



ఇస్మార్ట్ బ్యూటీ నిధి అగర్వాల్ కి లాస్ట్ ఇయర్ హరి హర వీరమల్లు చేసింది. ఆ సినిమా దాదాపు నాలుగేళ్లుగా సెట్స్ మీద ఉండి ఫైనల్ గా లాస్ట్ ఇయర్ రిలీజైంది. ఐతే సినిమాపై అంచనాలు ఉండటం దానికి తోడు క్రిష్ మధ్యలో వదిలేసిన ఆ ప్రాజెక్ట్ జయకృష్ణ పూర్తి చేయడం లాంటివి వీరమల్లు సినిమాను గాడి తప్పేలా చేశాయి. ఐతే ఆ సినిమా మీద హెూప్స్ పెట్టుకున్న నిధి అగర్వాల్ కి షాక్ తగిలినట్టు అయ్యింది. వీరమల్లు కోసం పవన్ కళ్యాణ్ కన్నా ఎక్కువ ప్రమోషన్స్ లో పాల్గొన్నది నిధి. ఐతే వీరమల్లు రిజల్ట్ ఎలా ఉన్నా అమ్మడి చేతిలో రాజా సాబ్ ఉంది కదా అని అనుకున్నారు. రాజా సాబ్ లో ముగ్గురు హీరోయిన్స్ ఉన్నా కాస్త స్క్రీన్ ప్రెజెన్స్ లో ఆకట్టుకుంది అంటే నిధి మాత్రమే. ప్రభాస్ పక్కన నిధి జోడీ ఆకట్టుకుంది. ఐతే రెబల్ స్టార్ ప్రభాస్ తో మారుతి చేసిన రాజా సాబ్ మీద నిధి చాలా హెూప్స్ పెట్టుకుంది. సినిమాతో ఎలాగైనా పాన్ ఇండియా క్రేజ్ తెచ్చుకోవాలని అనుకుంది. కానీ సినిమాకు వచ్చిన రెస్పాన్స్ చూసి అమ్మడికి నిరాశ తప్పట్లేదు. రాజా సాబ్ మీద నిధి అగర్వాల్ చాలా హెూప్స్ పెట్టుకుంది. ప్రభాస్ సినిమా అంటే నేషనల్ వైడ్ క్రేజ్ నెక్స్ట్ లెవెల్ లో ఉంటుంది. అలాంటి సినిమాలో నిధి నటించడం ఆమె రేంజ్ పెంచేలా చేస్తుందని అనుకున్నారు.



# కివీస్‌తో పోరులో టీమిండియా గెలుపు

## విరాట్ కోహ్లీ సెంచరీ మిస్.. కేఎల్ సూపర్ విన్నింగ్ సిక్స్

# ఉత్కంఠ విజయం



న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. వడోదర వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన భారత్ 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త ఉత్కంఠగా మారినా కేఎల్ రాహుల్ అద్భుతమైన సిక్సర్‌తో మ్యాచ్‌ను తనదైన శైలిలో ముగించాడు. ఈ గెలుపుతో ఈ ఏడాదిని టీమిండియా ఘనంగా మొదలుపెట్టింది.

**ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లకు 300 పరుగుల భారీ స్కోర్ చేసింది. డారిల్ మిచెల్(71 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 84), డెవాన్ కాన్వే(67 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 56), హెన్రీ నికోల్స్(69 బంతుల్లో 8 ఫోర్లతో 62) హాఫ్ సెంచరీలతో రాణించారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(2/40), హర్షిత్ రాణా(2/65), ప్రసిధ్ కృష్ణ(2/60) రెండేసి వికెట్లు తీయగా.. కుల్దీప్ యాదవ్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం భారత్ నిర్ణీత 49 ఓవర్లలో 6 వికెట్లకు 306 పరుగులు చేసి గెలుపొందింది.**

విరాట్ కోహ్లీ(91 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 93) తృటిలో శతకం చేజార్చుకోగా.. శుభ్‌మన్ గిల్(71 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించాడు. శ్రేయస్ అయ్యర్(47 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకున్నాడు. చివర్లో హర్షిత్ రాణా(23 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 29), కేఎల్ రాహుల్(21 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 29 నాటౌట్) విలువైన పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో కైల్ జెమీసన్(4/41) నాలుగు వికెట్లు తీయగా.. ఆదిత్య అశోక్, క్రిస్టన్ క్లార్క్ తలో వికెట్ తీసారు. భారీ లక్ష్యచేధనలో టీమిండియాకు ఆశించిన ఆరంభం దక్కలేదు. దూకుడుగా ఆడిన రోహిత్ శర్మ(26)ను జెమీసన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యమే నమోదైంది. క్రీజులోకి వచ్చిన కోహ్లీ దూకుడుగా ఆడటంతో పవర్ ప్లేలో భారత్ వికెట్ నష్టానికి 48 పరుగులే చేసింది. గిల్‌తో కలిసి విరాట్ కోహ్లీ తనదైన శైలిలో ఇన్నింగ్స్‌ను ముందుకు నడపించాడు. ముఖ్యంగా స్పిన్నర్ ఆదిత్య అశోక్‌అబశ్రీశ్రీను కోహ్లీ, గిల్ చితక్కొట్టారు. ఈ క్రమంలో కోహ్లీ 44 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. శుభ్‌మన్ గిల్ 66 బంతుల్లో అర్ధ శతకం అందుకున్నాడు. సాధికారికంగా ఆడిన ఈ జోడీని ఆదిత్య అశోక్ విడదీసాడు. ఊరించే బంతితో శుభ్‌మన్ గిల్‌ను క్యాచ్ ఔట్‌గా బోల్తా కొట్టించాడు. దాంతో రెండో వికెట్‌కు నమోదైన 118 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. గిల్ ఔటైనా.. అయ్యర్‌తో కలిసి కోహ్లీ చెలరేగాడు. శ్రేయస్ అయ్యర్ కూడా బౌండరీల మోత మోగించడంతో టీమిండియా స్కోర్ బోర్డు పరుగెత్తింది. సెంచరీ దిశగా సాగిన కోహ్లీని జెమీసన్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 77 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఆ వెంటనే జడేజా(4), అయ్యర్‌ను జెమీసన్ పెవిలియన్ చేర్చి మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చాడు. హర్షిత్ రాణా దూకుడుగా ఆడి భారత్‌ను గెలుపు రేసులో నిలబెట్టాడు. అతను ఇచ్చిన రెండు క్యాచ్‌లను న్యూజిలాండ్ ఫీల్డర్లు వదిలేయడం ఆ జట్టు కొంపముంచింది. చివరకు రాణాను క్రిస్టియన్ క్లార్క్ ఔట్ చేసినా.. వాషింగ్టన్ సుందర్‌తో కలిసి రాహుల్ విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. సిక్సర్‌తో రాహుల్ మ్యాచ్‌ను ముగించడం విశేషం.

## మరో 17 సెంచరీలు చేస్తే..

సచిన్ అత్యధిక పరుగుల రికార్డ్‌ను బ్రేక్ చేసే అవకాశం విరాట్ కోహ్లీకి లేదు. కానీ వన్డే ప్రపంచకప్ 2027 వరకు అతను ఫామ్‌లో కొనసాగితే 100 సెంచరీల రికార్డ్‌ను అధిగమించవచ్చు. ఈ రికార్డ్ సాధించేందుకు కోహ్లీకి ఇంకా 17 శతకాలు కావాలి. కానీ అతనికి 30 వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడే అవకాశం ఉంది. అది కూడా వన్డే ప్రపంచకప్ 2027లో భారత్ ఫైనల్ చేరితేనే 30 వన్డే మ్యాచ్‌లు ఆడగలడు. న్యూజిలాండ్‌తో సిరీస్ అనంతరం మరో 6 నెలల వరకు భారత్ వన్డేలు ఆడదు. ఇప్పటికే కోహ్లీ అంతర్జాతీయ టీ20లతో పాటు టెస్ట్‌లకు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే.

## సచిన్ ఆల్‌టైమ్ రికార్డ్ బద్దలు

అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత వేగంగా 28 వేల పరుగుల మైలురాయి అందుకున్న తొలి బ్యాటర్‌గా కోహ్లీ నిలిచాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా వడోదర వేదికగా ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ మైలురాయికి 25 పరుగుల దూరంలో ఉన్న కోహ్లీ.. న్యూజిలాండ్ స్పిన్నర్ ఆదిత్య అశోక్ బౌలింగ్‌లో బౌండరీ బాది ఈ ఘనతను అందుకున్నాడు. 624 ఇన్నింగ్స్‌ల్లోనే కోహ్లీ ఈ మైలురాయి అందుకొని అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించిన ఆటగాడిగా చరిత్రకెక్కాడు. ఈ క్రమంలో అతను సచిన్ టెండూల్కర్, కుమార సంగక్కరఅబశ్రీశ్రీల ఆల్‌టైమ్ రికార్డ్‌ను బ్రేక్ చేశాడు. సచిన్ టెండూల్కర్ 644 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఫీట్ సాధించగా.. కుమార సంగక్కర 666 ఇన్నింగ్స్‌ల్లో ఈ ఘనతను అందుకున్నాడు.

## సంగక్కర రికార్డ్ బద్దలు

ఈ 28వేల పరుగుల్లో కోహ్లీ 296 వన్డేల్లో 53 శతకాలు, 76 హాఫ్ సెంచరీలతో 14557లి పరుగులు చేశాడు. 210 టెస్ట్‌ల్లో 30 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలతో 9230 పరుగులు నమోదు చేశాడు. 117 టీ20ల్లో ఒక సెంచరీ 38 హాఫ్ సెంచరీలతో 4188 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో సంగక్కరను కోహ్లీ అధిగమించాడు. సంగక్కర 666 ఇన్నింగ్స్‌ల్లో 63 శతకాలు, 153 హాఫ్ సెంచరీలతో 28016 పరుగులు చేయగా.. సచిన్ టెండూల్కర్ 100 శతకాలు, 164 హాఫ్ సెంచరీలతో 34,357 పరుగులతో టాప్‌లో కొనసాగుతున్నాడు.

## గంగూలీ రికార్డు బద్దలు

విరాట్ కోహ్లీ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. అత్యధిక వన్డేలు ఆడిన జాబితాలో మాజీ క్రికెటర్ సౌరఅబశ్రీశ్రీవ్ గంగూలీ రికార్డును బ్రేక్ చేశాడు. సౌరవ్ గంగూలీ ఇప్పటి వరకు 308 వన్డేలు ఆడాడు. అయితే ఆ రికార్డును తాజాగా విరాట్ కోహ్లీ దాటేశాడు. న్యూజిలాండ్ తో మొదటి వన్డే మ్యాచ్ విరాట్ కోహ్లీ ఆడిన నేపథ్యంలో ఈ అరుదైన రికార్డు నెలకొల్పాడు. తన కెరీర్ లో 309వ వన్డే ఆడి చరిత్ర సృష్టించాడు. ఇక మొత్తంగా చూసుకున్నట్లయితే అత్యధిక వన్డేలు ఆడిన భారత బ్యాటర్ గా సచిన్ టెండుల్కర్ మొదటి స్థానంలో ఉన్నాడు. అతడు ఇప్పటివరకు 463 వన్డేలు ఆడాడు. అతని తర్వాత 347 వన్డేలతో మఅబశ్రీశ్రీహేంద్ర సింగ్ ధోని రెండవ స్థానంలో ఉన్నాడు. రాహుల్ ద్రవిడ్ 340, అజారుద్దీన్ 334 వన్డేలు ఆడి తర్వాతి స్థానాల్లో నిలిచారు. తాజాగా సౌరఅబశ్రీశ్రీవ్ గంగూలీ రికార్డు బ్రేక్ చేసిన విరాట్ కోహ్లీ, 2027 వన్డే వరల్డ్ కప్ వరకు రిటైర్మెంట్ ప్రకటించకుండా వరుసగా మ్యాచ్ లు ఆడినప్పటికీ, ధోని రికార్డు బ్రేక్ చేయడం కష్టమే అంటున్నారు ఫాన్స్.



## ఢిల్లీపై గుజరాత్ విజయం

**4 పరుగుల తేడాతో ఉత్కంఠ గెలుపు**

మహిళల ప్రీమియర్ లీగ్2026లో జరిగిన 4వ మ్యాచ్‌లో గుజరాత్ గియంట్స్ ఢిల్లీ క్యాపిటల్స్‌పై 4 పరుగుల తేడాతో ఉత్కంఠభరిత విజయం సాధించింది. జనవరి 11న నవి ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ జెమిమా రోడ్రిగ్స్ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ జెయింట్స్ 20 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది. ఈ ఇన్నింగ్స్‌లో సోఫీ డివైన్ అద్భుతంగా ఆడి 42 బంతుల్లో 95 పరుగులు చేసింది. చివరి ఓవర్‌లో స్నేహ రాణా వేసిన బంతుల్లో వరుసగా 4, 4, 6, 6, 6, 6 బాది ఒక్క ఓవర్‌లోనే 32 పరుగులు సాధించి మ్యాచ్‌ను మలుపు తిప్పింది. కెప్టెన్ అష్లీ గార్డనర్ కూడా 26 బంతుల్లో 49 పరుగులతో రాణించింది. ఢిల్లీ బౌలర్లలో నందిని శర్మ హాట్రిక్‌తో సహా 5 వికెట్లు తీసి ఆకట్టుకుంది. లక్ష్య ఛేజ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 205 పరుగులకు 5 వికెట్లు మాత్రమే కోల్పోయినా, చివరికి 4 పరుగుల తేడాతో ఓడిపోయింది. లారా వోల్వార్డ్ 38 బంతుల్లో 77 పరుగులు చేసి పోరాడినా ఫలితం దక్కలేదు. చివరి ఓవర్‌లో 7 పరుగులు కావాల్సిన సమయంలో సోఫీ డివైన్ కీలక వికెట్లు తీసి గుజరాత్‌కు విజయం అందించింది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ అద్భుత ప్రదర్శన చేసిన సోఫీ డివైన్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ణ అవార్డు దక్కింది. ఈ విజయంతో గుజరాత్ జెయింట్స్ రెండు మ్యాచ్‌ల్లో రెండు గెలుపులతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది.



## నెట్టింట్లో ట్రెండింగ్‌గా ఆర్సీబీ బ్యూటీ

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్) 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) తరపున అరంగేట్రం చేసిన ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్.. మైదానంలోనే కాకుండా సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తోంది. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌తో ఉమెన్స్ ప్రీమియర్ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ బ్యూటీఫుల్ అండ్ టాలెంటెడ్ బౌలర్ కేవలం 24 గంటల్లోనే ఓ పెద్ద మైలురాయిని చేరుకుంది. లారెన్ బెల్ తన ఆటతీరుతో, తన లుక్స్‌తో భారతీయ క్రికెట్ అభిమానులను అమితంగా ఆకట్టుకుంది. దీని ఫలితంగా ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్ల సంఖ్య వేగంగా పెరిగి మిలియన్(10లక్షల) మార్కును దాటింది. ఈ అరుదైన ఘనతపై లారెన్ బెల్ స్పందిస్తూ ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో "ఇక్కడ 10 లక్షల మంది ఉన్నారంటే నమ్మలేకపోతున్నాను!" అంటూ తన ఆనందాన్ని పంచుకుంది. అభిమానులందరికీ కృతజ్ఞతలు తెలిపింది. ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో లారెన్ బెల్ తన బౌలింగ్‌తో ముంబై బ్యాటర్లను కట్టడి చేసింది.

## భారత్‌లో ఫిఫా ట్రోఫీ ఆవిష్కరణ

ఫుట్‌బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్. నిరుడు 'గోట్ ఇండియా టూర్ ఆఫ్ ఇండియా 2025'లో లియోనల్ మెస్సీ భారత్‌లోని ప్రధాన నగరాలను మెరుపులా చుట్టేయగా.. ఇప్పుడు ఫిఫా వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి మొదలైంది. మెగా టోర్నీకి 6 నెలల గడువే ఉండడంతో నిర్వాహకులు ట్రోఫీని అభిమానుల సందర్శన కోసం భారత్‌కు తీసుకొచ్చారు. ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య అధ్యక్షుడు కల్యాణ్ చౌబే ట్రోఫీని ఆవిష్కరించారు. పుష్కరకాలం తర్వాత ఫిఫా ప్రపంచకప్ ట్రోఫీని భారత్‌లో ప్రదర్శిస్తున్నారు. మూడు రోజులు దేశంలోని ప్రధాన నగారాల్లో అభిమానుల సందర్శనార్థం ఈ ట్రోఫీని ఉంచుతారు. ఫిఫా ట్రోఫీ ఆవిష్కరణలో ఏఐఎఫ్ఎఫ్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబే, కేంద్ర క్రీడల మంత్రి, యువజనుల వ్యవహారాల మంత్రి మన్సూఖ్ మాండవీయ, బ్రెజిల్ వరల్డ్‌కప్ విజేత గిల్బెర్టో సిల్వా పాల్గొన్నారు. రెండు రోజులు ఢిల్లీలోని ప్రముఖ సెంటర్లలో ఫిఫా ట్రోఫీని ప్రదర్శనకు ఉంచుతారు. అనంతరం అస్సాంలోని గువాహటిలో వరల్డ్‌కప్ ట్రోఫీ సందడి చేయనుంది. అయితే.. భారత ఫుట్‌బాల్‌ను నాశనం చేస్తున్న చౌబే.. సాకర్ కప్‌ను ఆవిష్కరించడాన్ని పలువురు తప్పుపడుతున్నారు. ఇండియన్ సూపర్ లీగ్ ప్రారంభోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి మన్సూఖ్ పాపులర్ జట్ల మోహన్ బగన్, ఈస్ట్ బెంగాల్ పేర్లను తప్పుగా పలకడం కూడా విమర్శలకు తావిచ్చింది.




మండిపడుతున్నారు. కాగా, ఈఏడాది ఫిఫా ప్రపంచకప్ పోటీలకు అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. జూన్ 11వ తేదీ గురువారం ఫిఫా వరల్డ్‌కప్ ప్రారంభం కానుంది. నెల రోజులకుపైగా అభిమానులను గోల్స్ వర్షంలో ముంచెత్తనున్న ఈ టోర్నీ జూలై 19వ తేదీన ముగియనుంది. గత సీజన్‌లో విజేతగా నిలిచిన అర్జెంటీనా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
www.evarthalu.com
నేటి ఈవార్తలు
సోమవారం 12-1-2026



# యజ్ఞం.. అసలు సిసలైన సైన్స్

1984 డిసెంబర్ 3: భోపాల్ విషవాయువుతో స్మశానమైంది
2011 మార్చి 11: సునామీతో జపాన్ కాష్టాల దిబ్బగా మారింది.
అణువులు బద్దలైపోయాయి.
ఆకాశమంతటా రేడియేషన్ సెగలు
టోక్యో నుంచి రష్యాదాకా నిండుకున్న హాలాహలం

ఇప్పుడు ప్రపంచం వణికిపోతోంది.. ఒక అణువుకు భయపడిపోతోంది.. అది విడుదల చేసే అతి భయంకరమైన శక్తికి బెంబేలెత్తిపోతోంది. అందులోంచి వచ్చే ధూళికి దిగాలు పడిపోతోంది. ఒక ప్రాంతాన్ని, ఒక నగరాన్ని, ఒక దేశాన్ని మట్టి కరిపించిన ఆ దుమ్ము.. ఇప్పుడు ప్రపంచానికి సవాలుగా మారింది. కష్టపడి తయారు చేసుకుని టన్నుల కొద్దీ నిలువ చేసుకున్న అణువులు ఒక్కసారిగా బద్దలైపోతే, ఈ అణువులను చూపి ప్రపంచాన్ని ఏలుతున్న పెద్దన్నలంతా అయోమయంలో పడిపోయారు.



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

ప్రపంచ దేశాలను బెదిరించేం దుకు.. పెత్తనం చెలాయించేందుకు టన్నుల కొద్దీ ఆ పదార్థాన్ని పోగేసుకున్న ప్రపంచ పోలీసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెన్నులోంచి వణుకుపుట్టుకొస్తోంది. ఏ చిన్న పొరపాటు జరిగినా మహా వినాశనం తప్ప నియంత్రణ సాధ్యంకాదు. ఎందుకంటే క్షణాల్లో సర్వనాశనమే జరుగుతుంది. అణు విద్యుత్తు.. అణ్వస్త్రం.. దీంతో ప్రపంచాన్ని జయించవచ్చనే ధీమాతో ఉన్న రాజ్యాలకు అవే తమకు ప్రాణాంతకంగా మారుతున్నాయని జపాన్ ఉదంతంతో తేలిపోయింది. ఇవన్నీ పైపైకి బీరాలు బాగానే పలుకుతున్నాయి. ఎలాంటి సమస్య లేదని.. అన్నింటినీ అధిగమిస్తామంటూ డంబాలు పోతున్నాయి. కానీ, ఈ అణువులు ఒక్కసారి బద్దలైతే.. మూడువేల భూగోళాలను ఒక్క క్షణంలో నాశనం చేసే శక్తిని విడుదల చేస్తుంది. అంటే మనం చేసిన ఈ పనికి మొత్తం పాలపుంతే ఉనికి లేకుండా పోతుందా? అవును.. మన సౌరమండలాన్ని మనమే నాశనం చేసుకునే దిశగా అణు సంపదను తయారు చేసుకుని పెట్టుకున్నాం. ఇప్పుడేం చేయాలి? ఏమీ అర్థం కావటం లేదు. ఈ సమస్యకు పరిష్కారం లేదా?

ఉంది.. మన వేదం చూపిన పరిష్కారం ఇది. పెనుముప్పును సైతం తప్పించే రక్షణ కవచం. అణు ధార్మికతకు కవచం.. రేడియేషన్‌ను తరిమేసే మహాశక్తి, మన వేదాలు మనకు అందించిన గొప్ప సైన్స్, విధ్వంసం నుంచి విముక్తి కోసం మృత సంజీవని యజ్ఞం. ఆలయాల్లో.. వివిధ సందర్భాల్లో మన ఇళ్లల్లో చిన్నగా చేసుకునే యజ్ఞయాగాలే ప్రపంచాన్ని పెను ముప్పునుంచి కాపాడే ఏకైక ప్రక్రియ. ఇది హేతువాదానికి అర్థం కాని అబ్బురం.. సైన్స్కు సైతం ఆశ్చర్యం కొలిపే అద్భుతం. ఇది ఆరోగ్యానికి, ఆనందానికి, జీవితానికి ఆలంబనగా నిలిచే మహాశక్తి ఆవిర్భావానికి చేసే ప్రయత్నం. మనకు మాత్రమే తెలిసిన, మనం మాత్రమే చేయగలిగిన వేద విజ్ఞానం. ఒక్కసారిగా నమ్మకం కుదరకపోవచ్చు. ఆశ్చర్యం వేయవచ్చు. పుక్కిటిపురాణంగా తోచవచ్చు. కానీ, ఇదే వాస్తవం. యజ్ఞమే మన ముందున్న ఏకైక పరిష్కారం. ప్రపంచాన్ని, విశ్వాన్ని కాపాడే ఒకే ఒక్క ప్రక్రియ.. అవును, ఇవాళ ప్రపంచాన్ని ఒక్కసారిగా కుదిపేసిన రేడియేషన్ తరంగాలను ఆపే శక్తి కేవలం యజ్ఞానికే ఉంది. ఇది కేవలం భక్తి కార్యక్రమమే కాదు.. దీని వెనుక అసాధారణ శక్తి దాగుంది. మనకు తెలిసినంత మేరకు యజ్ఞం అనేది, పైలోకాల్లో ఉన్న దేవతలను సంతృప్తి పరచి, కోరుకున్న కోరికలను తీర్చుకునే ఒకానొక ఆధ్యాత్మిక ప్రక్రియ. ఇందుకోసం ఒక యజ్ఞకుండం ఏర్పాటు చేసి అందులో నిప్పును రాజేసి, సమిధలను వేస్తూ.. నెయ్యిని పోస్తూ.. మంత్రాలు చదువుతూ నిర్వహించే ఒక విధానం. రావి, మోదుగ, మామిడి, జువ్వి, మేడి చెట్టుకు సంబంధించిన కొమ్మలను సమిధలుగా చేసి యజ్ఞంలో ఉపయోగిస్తారు. ఇవి కాకుండా జిల్లేడు, నేరేడు కొమ్మలను కూడా ఇందులో ఉపయోగిస్తారు. అగ్ని నిరంతరంగా ప్రజ్వరిల్లేందుకు ఆవు నెయ్యిని స్వాహాకారాలతో హోమకుండంలో పోస్తుంటారు. వీటికి తోడుగా మరికొన్ని పదార్థాలను ఇందులో సమిధలను చేస్తారు.

వేదాల్లో నాలుగు వందల రకాల యజ్ఞాల గురించిన ప్రస్తావన ఉంది. వీటిని ఎప్పుడు ఎలా ఏ విధంగా నిర్వహించాలో వివరణ ఉంది. ఇంట్లో చేసే యజ్ఞానికి, సమాజం కోసం సామూహికంగా నిర్వహించే యాగానికి తేడాలు ఉన్నాయి. కొన్ని యజ్ఞాలు నిమిషాల్లో పూర్తవుతాయి. మరి కొన్ని, కొద్ది గంటల్లో ముగుస్తాయి. ఇంకొన్ని రోజులకొద్దీ.. సంవత్సరాల కొద్ది కొనసాగుతాయి కూడా. ఇవన్నీ బాగానే ఉన్నాయి. యజ్ఞాలు చేసుకోవచ్చు. దేవతలనే వాళ్ళు ఉంటే వాళ్లను సంతృప్తి పరిచి వాళ నుంచి వరాలు పొందితే పొందవచ్చు. దీనికీ రేడియేషన్‌కు సంబంధం ఏమిటి? హవనం వల్ల రేడియేషన్‌ను ఎలా తరిమేయవచ్చు..? అంటే జవాబు యజ్ఞమే చెప్తుంది. యజ్ఞం అనేది గాలిని పరిశుభ్రం చేస్తుంది. భూమిని శుద్ధి చేస్తుంది. నీటిని పొటెక్ట్ చేస్తుంది. వాతావరణంలో అనేకానేక టాక్సిన్ గ్యాస్లను రాకుండా అడ్డుకుంటుంది. ఎందుకంటే పొల్యూషన్ అనేది వాతావరణంలోంచే మన శరీరాలోకి ఎంటరవుతోంది. ఈ కాలుష్యాన్ని అడ్డుకోవటానికి వాతావరణాన్ని నియంత్రణలో ఉంచుకోవటమే ముఖ్యం. అందుకు యజ్ఞం ఉపయోగపడుతుంది. అందులో వేసే సమిధలు సహకరిస్తాయి. అందులో పోసే ఆవునెయ్యి కీలకంగా పనిచేస్తుంది. స్వాహా సమయంలో ఉచ్ఛరించే మంత్రం వెలువరించే ధ్వని తరంగాలు ఉపయోగపడతాయి. మన దగ్గరున్న ఒకే ఒక బలహీనత పొరిగింటి పుల్లటి కూరైనా రుచిగా ఉందని మెచ్చుకోవటం.. మన ఇంట్లో కూర ఎంత అద్భుతంగా ఉన్నా దాన్ని పట్టించుకోకపోవటం.. మన కల్చర్లో, మన నాగరికతలో ఎన్నుంటే ఏం లాభం చెప్పండి? అవి మనకు అర్థం కావు.. అర్థమయ్యేలా చెప్పేవాళ్లు లేరు.. చెప్పినా విని నమ్మే పరిస్థితిలో మనం లేము. కానీ, ఒక్కసారి అన్నింటినీ పక్కకు పెట్టి ఆలోచించండి.. యజ్ఞం ఎందుకు చేస్తారని? దాన్ని నిర్వహించటం వెనుక లాజిక్ ఏముందో ఒక్కసారి తెలుసుకోండి. యోగం.. తంత్రం... వైద్యం.. భక్తి.. మోక్షం ఈ అయిదు కలిస్తే అది యజ్ఞం. హోమకుండం, ధృతం, సమిధ, దర్భ, మంత్రం ఇవన్నీ దీనికి ఉపకరణాలు. హోమకుండం కుండలినీ యోగశక్తికి ప్రతీక. మనిషిలో శక్తి చైతన్యాన్ని పెంపొందించుకోవటానికి ఇది ప్రతీక. యజ్ఞంలో మేటర్ కంటే మెటీరియల్దే ప్రధాన భూమిక పోషిస్తుంది. ప్రత్యేకమైన స్థాయిల్లో మంత్రం ఉచ్ఛరిస్తున్నప్పుడు అది మన చుట్టూ ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేస్తుంది.

సాధారణ సమయాల్లో మన చుట్టూ రెండున్నర అర్ధమీటర్ల వ్యాసంలో ఓరా ఉంటే.. యజ్ఞం వల్ల 14.5 అర్ధమీటర్ల ఓరా అంటే రక్షణ వలయం ఏర్పాటు అవుతుంది. వీటి నుంచి వచ్చే తరంగాలు మనపైనా, మన చుట్టూ ఉండే వాతావరణంలోని ఎలక్ట్రానిక్ తరంగాలపైనా రకరకాల తీవ్రతల్లో ప్రభావం చూపిస్తాయి. యజ్ఞంలో ఉపయోగించే సమిధల్లో పంచపల్లవాలు ప్రధానమైనవి. యాగం మొత్తం సమిధలుగా మారిన పల్లవాలతోనే సాగుతుంది. ఇవి అగ్నిలో దహనం అయి రేణువుల్లా మారి వాతావరణంలో కలిసి వాతావరణంలోని విషవాయువులను శుద్ధి చేస్తాయి. ఈ సమిధలన్నీ ఔషధ మూలికలే. మామూలుగా మనకు మందులు కావాలంటే ఎన్నో టన్నులు అవసరమవుతాయి. ఇవి వాతావరణంలో కలిసిపోవటం వల్ల వీటి శక్తి రెట్టింపుగా విడుదల అవుతుంది. విష వాయువులు మేఘాలతో కలిస్తే యాసిడ్ వర్షాలు కురుస్తాయి. ఇందుకు సంబంధించిన రుజువులు కూడా ఇటీవలి కాలంలో వివిధ దేశాల్లో చూశాం. జపాన్ విడుదలైన రేడియేషన్ కూడా వర్షంగా రూపాంతరం చెందే అవకాశం లేకపోలేదన్న ఆందోళనా వ్యక్తం అవుతోంది. వీటిని నియంత్రించటానికి యజ్ఞం ఒక్కటే మార్గం. యజ్ఞంలో వేసిన సమిధలు దాదాపు మూడు కిలోమీటర్ల ఎత్తున అంతే విస్తీర్ణంలో ఒక వలయంగా ఏర్పడతాయి. పైనుంచి వచ్చే ఎలాంటి నెగెటివ్ ఫోర్స్నైనా ఈ వలయం అడ్డుకుంటుంది. యజ్ఞంలో మనం అన్నింటికంటే ఎక్కువగా, కీలకంగా ఉపయోగించేది నెయ్యి. స్పిర్చ్యువల్ పరిభాషలో దీన్నే ధృతం అంటారు. ఇందులో ఆవు నెయ్యిని వాడతారు. అది దొరకని సందర్భాల్లో గేదె నెయ్యినీ ఉపయోగిస్తుంటారు. ఆవు నెయ్యి అనేది వాతావరణంలో చాలా ప్రభావం చూపిస్తుంది. యజ్ఞం జరిగిన ప్రదేశంలో మొత్తం ఎనిమిదిన్నర కిలోమీటర్ల ఎత్తు వరకు ఈ నేతి ప్రభావం ఉంటుంది. అగ్నిహోత్రం ద్వారా గాలిలో రేణువుల్లా కలిసి పోయిన తరువాత ఈ నెయ్యి శీతలీకరణ కణాలను వాతావరణంలో సృష్టిస్తుంది. ఇది రేడియేషన్ ప్రభావాన్ని పూర్తిగా తగ్గిస్తుంది. వాతావరణంలో వేడిని తగ్గిస్తుంది. దీంతోపాటు ఆక్సీజన్ పరిమాణాన్ని కూడా అధికమొత్తంలో పెంచుతుంది. జర్మనీలోని రీసర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ స్పిర్చ్యువాలిటీ నిపుణులు ప్రయోగాత్మకంగా నిరూపించిన సత్యం ఇది.

ఓంకారం సంపూర్ణ సృష్టిని సూచిస్తుంది. యజ్ఞం పూర్తి విశ్వాన్ని ప్రతిబింబిస్తుంది. మంత్రానికి ఉచ్ఛరించే వ్యక్తికి ఉన్న గ్రహణశక్తికి మించిన సహజమైన అర్థం ఉంటుంది. వాటి నుంచి వచ్చే తరంగాలకు అగ్నిహోత్రం నుంచి వెలువడే రేణువులు కలిసి వాతావరణాన్ని పూర్తిగా సమతుల్యం చేస్తాయి. దీని ప్రభావం భూమిపై.. అక్కడ ఉన్న జీవులపై కొన్ని గంటల నుంచి కొన్ని సంవత్సరాల దాకా ఉంటుంది.. ఇదంతా సామాన్య శాస్త్రానికి అంతుపట్టని వేదశాస్త్ర రహస్యం.. యజ్ఞ రహస్యం. భోపాల్లో విషవాయువు ప్రమాదం జరిగినప్పుడు అదే నగరంలోని అగ్నిహోత్ర సమాజానికి చెందిన పదకొండు కుటుంబాలకు ఎలాంటి ఆపద వాటిల్లలేదు.. ఇది కళ్లముందు కనిపిస్తున్న వాస్తవం. ఎందుకంటే ఈ పదకొండు ఇళ్లలో నిత్యం అగ్నిహోత్రం వెలుగుతుంటుంది. హోమం జరగని రోజంటూ ఉండదు. ఈ హోమ ద్రవ్యాల కారణంగా ఆ ఇంటి పరిసర ప్రాంతంలో విష ప్రభావం ప్రవేశించకుండా ఆగిపోయింది. దీనిపై బ్రిటిష్ శాస్త్రవేత్తల బృందం ఒకటి పరిశోధన జరిపి నిర్ధారణ చేసింది కూడా. యజ్ఞం చేసినప్పుడు అందులో ఆహుతులైన వస్తువులన్నీ రూపాంతరం చెంది పొగరూపంలో, ధూళి రూపంలో, రేణువుల రూపంలో వాతావరణంలో కలిసిపోతాయి. మంత్రం వైబ్రేషన్ వీటిని ఒక రక్షణ కవచంగా ఏర్పడటానికి వలయాకారంలో ప్రసరిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే ఉపగ్రహాన్ని నిర్దిష్టమైన కక్ష్యలో ప్రవేశపెట్టడానికి రాకెట్ ఉపయోగపడినట్లే ఇది కూడా ఉంటుంది. రేడియేషన్ తీవ్రత స్థాయిని ఈ వలయమే తగ్గించుకుంటూ పోతుంది. ఒక మెగాటన్ అణుధార్మికత విడుదలైనప్పుడు అది 4 దశల్లో వాతావరణంపై ఇంపాక్ట్ చూపిస్తుంది. జీరోగ్రౌండ్లో బ్లాక్ రేడియేషన్ విడుదలవుతుంది. ఇది అ రియాక్టర్ పరిధి దాటి బయటకు రాదు.. దీనిపై అగ్నిహోత్రం ప్రభావం ఏదీ ఉండదు. రెండో దశలో అయొనైజ్డ్ రేడియేషన్ విడుదలవుతుంది. ఇది సుమారు 7 కిలోమీటర్ల మేర విస్తరిస్తుంది. మూడో దశలో థర్మల్ రేడియేషన్ బయటకు వస్తుంది. ఇది మరింత ఎక్కువ ప్రాంతానికి విస్తరిస్తుంది. నాలుగో దశ ఫార్ అవుట్ దశ. ఇది క్రమంగా కొంత కొంతగా ఆకాశంలో విస్తరించుకుంటూ వెళ్తుంది. ఇది చాలా ప్రమాదకరమైన దశ.. ఇలా రేడియేషన్ విస్తరించిన ప్రాంతంలో గడ్డి కూడా మొలవదు. ఈ విధంగా వ్యాపిస్తున్న రేడియేషనన్ను యజ్ఞం నుంచి వెలువడిన రేణువులు సక్సెస్ఫుల్గా నిరోధించగలుగుతాయి. అంతే కాదు.. మనకు అనూహ్యంగా వచ్చేస్తున్న వైరల్ రోగాలన్నీ కూడా గాల్లోంచి విస్తరించి అంటుకుంటున్నవే.. ఎయిడ్స్ నుంచి స్వైన్ఫ్లూ, డెంగ్యూ వంటి వ్యాధులన్నీ గాలి కాలుష్యం నుంచి వ్యాపించినవే.. యజ్ఞంలో ఉపయోగించే ఔషధ మూలికలు అన్నీ వీటిని ముందుగానే నిరోధిస్తాయి. రోగాల్ని నిరోధించే శక్తి యజ్ఞవాయువును పీల్చటం ద్వారా మనకు వస్తుంది.

భారతీయ సైంటిఫిక్ స్పిరిచ్యువాలిటీకి యజ్ఞం తిరుగులేని ఉదాహరణ. ఏదో చేద్దామని.. ఏదేదో సృష్టిద్దామని.. ఎవరినో శాసిద్దామని.. మహా మారణాయుధాలను మంచం కింద పెట్టుకుని, హాయిగా నిద్రిస్తున్నామనుకుంటున్నాం.. మనం పెంచిన పాములు మనల్నేం చేస్తాయన్న ధీమాతో ఉంటున్నాం.. కానీ, ఆ ఆయుధాలనే పాములు మాటేసుకుని వున్నాయి. కాలం కోసం ఎదురు చూస్తున్నాయి. చిన్న అవకాశమొచ్చినా ప్రళయం సృష్టించేందుకు సిద్ధంగా ఉన్నాయి. దీన్ని నియంత్రించటం అవసరం. దానికి యజ్ఞం ప్రపంచానికి ఒకదారి చూపిస్తోంది.. దాన్ని ఏదో ఒక రూపంలో ప్రపంచం అనుసరించటం మానవాళికే ప్రయోజనం. వేదాల్లో అన్నీ ఉన్నాయిష అని గురజాడ అప్పారావు కన్యాశుల్కంలో ఓ పాత్ర వెక్కిరిస్తుంది. ఇది భారతీయ కల్చర్ని ఒకవిధంగా మిటకరించటమే. దేవుణ్ణి నమ్మవచ్చు.. నమ్మకపోవచ్చు.. కానీ, మనవాళ్లు చెప్పుతున్న విషయాల్లో వాస్తవం ఏమిటన్నది తెలుసుకునేందుకైనా ప్రయత్నించాలి. వేదాల్లో యజ్ఞం ఒక పార్ట్ మాత్రమే.. వాటిని మత గ్రంథలుగా చూడకుండా, అందులోని సాంకేతిక నైపుణ్యాన్ని గ్రహించటం వల్ల ప్రయోజనం తప్ప చెడుమాత్రం కలగదు.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.